PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 269 | విజయవాడ, శుక్రవారం 2 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 2 May 2025 | Rs



కర్నూలులో మేడే జెండాను ఎగురవేస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్

విశాఖలో నిర్వహించిన భారీ ర్యాలీలో సిహెచ్.నర్సింగరావు, కార్మికులు

ఐక్యతకు నిదర్శనం 'మేడే'

కార్మికులు, కర్షకుల హక్కుల కోసం ఉద్యమించాలి

- రాష్ట్ర వ్యాప్తంగా మేడే వేడుకల్లో నేతల పిలుపు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శనలు

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సిఐటియు ఆధ్వర్యాన భారీ ర్యాలీ

ప్రజాశక్తి-యంత్రాంగం

మేడే సందర్భంగా కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు బైక్ ర్యాలీలు, సభలు, సమావేశాలు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. పలుచోట్ల సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శించారు. ప్రపంచ కార్మికుల్లారా ఏకంకండి.. కార్మికుల ఐక్యత వర్థిల్లాలంటూ నినాదాలు చేశారు. తొలుత పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని పురష్కరించుకొని ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలు వేసి నివాళి అర్పించారు. ఆయా చోట్ల కార్మిక పతాకాన్ని నాయకులు ఆవిష్కరించి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు నిరంకుశ విధానాలు మానుకోకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

విశాఖ జిల్లా దొండపర్తిలోని రైల్వే డిఆర్ఎం కార్యాలయం నుంచి ఆశీలమెట్ట వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ కోసం ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెద్దఎత్తున దాడికి దిగిందన్నారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టడంతో పాటు పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధికి పెద్దఎత్తున గండిగొడుతోందని వివరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను అన్యాయంగా తొలగించడానికి పూనుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఉక్కు నగరంలో కార్మికులు మేడే కవాతు నిర్వహించారు. ఎర్రజెండాను సిహెచ్.నర్సింగరావు ఆవిష్కరించారు. గాజువాకలో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనకాపల్లి జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయం వద్ద యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం, అల్లూరి జిల్లా రంపచోడవరంలో అంగన్‌వాడీ యూనియన్ సీనియర్ నేత కె.మంగమ్మ కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతపురంలో మున్సిపల్ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం లలిత కళాపరిషత్‌లో నిర్వహించిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టేందుకు ఐక్య పోరాటమే మార్గమని పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లోనే మేడే సందర్భంగా సిఐటియు జెండాలను ఎగురవేశారు. కర్నూలులో జరిగిన బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యాలయంలోనూ ఎర్ర జెండాను గఫూర్ ఆవిష్కరించారు. అంతకు ముందు పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి నివాళులర్పించారు. నంద్యాల సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సిఐటియు కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాశ్ పతాకావిష్కరణ చేశారు. కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో కార్మికులు బైకు ర్యాలీలు, ప్రదర్శనలు చేశారు. నెల్లూరు నగరంలో ఎబిఎం కాంపౌండ్ ప్రాంతం నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకు కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పాల్గొని మాట్లాడారు. కోవూరులో పారిశుధ్య కార్మికురాలితో మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించి పంపిణీ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ అన్నపూర్ణ ముఠా సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, రాష్ట్ర పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ సిహెచ్ బాబూరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మేడే స్ఫూర్తితో కార్మికుల, కర్షకుల హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీసెంట్ రోడ్ అన్సారీ పార్క్ వద్ద జరిగిన కార్యక్రమంలో సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని విధానం, లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి పాల్గొన్నారు. మేడే సందర్భంగా పలు కేంద్రాల్లో మజ్జిగ, స్వీట్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. గుంటూరు నగరంలో జరిగిన మేడే వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు. అశోక్ నగర్‌లో లక్ష్మణరావు మాట్లాడుతూ.. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లో సాంస్కృతిక సభ నిర్వహించారు. గాయకులు పి.వి.రమణ, లెనినా, లూథర్‌పాల్ శ్రామిక గేయాలు ఆలపించారు. ఏకపాత్రాభినయం, భరత నాట్యంతో కళాకారులు అలరించారు. పెదకాకానిలో జెండా ఆవిష్కరణలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ పాల్గొన్నారు. రాజధాని తుళ్లూరు మండలంలో పలు గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు నిర్వహించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో చిలకలూరిపేటలోని సిపిఎం కార్యాలయం వద్ద జెండాను ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ ఆవిష్కరించారు. నాదెండ్ల ఆటో కార్మికులు 400 మందికి భోజనం అందించారు. మాచర్లలో పలుచోట్ల జెండాలను సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ ఆవిష్కరించారు. పిడుగురాళ్లలో ఆటో కార్మికులు జెండాను ఆవిష్కరించగా ముఖ్యఅతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి హాజరై మాట్లాడారు. సత్తెనపల్లిలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, వినుకొండలో ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జివి ఆంజనేయులు ఎర్ర జెండాను ఎగురవేశారు. శ్రీకాకుళం నగరంలో కార్మికులు భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక డైమండ్ పార్కు నుంచి జి.టి రోడ్డు మీదుగా ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముందు భవన నిర్మాణ రంగం కార్మికులు చేసిన కర్రసాము ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయనగరంలో కార్మికులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బొబ్బిలిలో ఎఐఎఫ్‌టియు ఆధ్వర్యాన జరిగిన సభలో సినీనటుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. మోడీ అనుసరిస్తోన్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా కార్మికులు ర్యాలీలు నిర్వహించారు. బాపట్ల జిల్లా చీరాలలో మేడే జెండాను ప్రదర్శిస్తూ కార్మికులు సందడి చేశారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో మహిళలు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. తిరుపతిలోని సిఐటియు కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి జెండా ఆవిష్కరణ చేశారు. రేణిగుంటలో కార్మికులు లేబర్‌కోడ్ బుక్‌లెట్లను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. చిత్తూరు, కడప జిల్లాల్లో ర్యాలీలు నిర్వహించారు.

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో మేడే సందర్భంగా భారీ ర్యాలీ, సభ నిర్వహించారు. ర్యాలీ సభలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి, వ్యకాస రాష్ట్ర నేత మంతెన సీతారాం, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. ఆకివీడులో జరిగిన ప్రదర్శన, సభలో ప్రజాసంఘాల రాష్ట్ర నేత బి.బలరాం పాల్గొని మాట్లాడారు. తాడేపల్లిగూడెంలో జరిగిన భారీ ర్యాలీ, సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొనగా, తణుకులో జరిగిన సభ, ర్యాలీ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడారు. ఆచంటలో మహిళా కార్మికులు ప్రదర్శించిన కోలాట నృత్యం అందరినీ ఆకట్టుకుంది. పాలకొల్లులో మేడే సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు రిక్షా తొక్కుతూ రిక్షా కార్మికుల ర్యాలీలో పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్‌కు తలొగ్గుతున్న టిడిపి?

- మహిళా నేత సస్పెన్షన్ వెనుక ..!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్ఎస్ఎస్ ఒత్తిడికి టిడిపి తలొగ్గుతోందా? ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలే ఈ ప్రశ్నకు కారణం. ఒక మహిళా నేతను టిడిపి నుండి సస్పెండ్ చేయడం వెనుక ఆర్ఎస్ఎస్ ఒత్తిడి ఉందన్న చర్చ ఆ పార్టీశ్రేణుల్లోనే సాగుతోంది. టిడిపి మహిళ స్టేట్ మీడియా కోఆర్డినేటర్‌గా ఉన్న సందిరెడ్డి గాయత్రి పెహల్గాం ఉగ్రదాడిపై జరిగిన ఒక చర్చాగోష్టిలో ఇటీవల పాల్గొన్నారు. చర్చలో భాగంగా ఆమె ' భారతదేశం రాజ్యాంగాన్ని అనుసరించి నడుస్తోంది, రామాయణం, మహాభారతం వంటి మత గ్రంథాలను అనుసరించి కాదు' అని చెప్పారు. ఈ వీడియోను ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో సైతం పోస్టు చేశారు. అయితే, ఈ వ్యాఖ్యలు సంఘ్‌పరివార్‌శక్తులకు ఆగ్రహం కలిగించాయని చెబుతున్నారు. దీంతో 'హిందూ ఐటి సెల్' ఆమెపై దాడికి దిగింది. గాయత్రిపై చర్యలు తీసుకోవాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ఎక్స్‌లోనే 'హిందూ ఐటిసెల్' ఫిర్యాదు చేసింది. అయితే, ఆ ఫిర్యాదుపై టిడిపి నాయకత్వం స్పందించిన తీరుపైనే ప్రస్తుతం కార్యకర్తల్లో చర్చ సాగుతోంది. సోషల్ మీడియాలో గాయత్రిపై వస్తున్న ఆరోపణలు నేపధ్యంలో, పార్టీ నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించిన ఆమెను సస్పెండ్ చేసి విచారణకు ఆదేశిస్తున్నట్లు టిడిపి కార్యాలయ కార్యదర్శి పి. అశోక్‌బాబు ఒక నోట్ విడుదల చేశారు. కనీసం వివరణ కూడా తీసుకోకుండా ఏకంగా సస్పెండ్ చేయడంపై ఆ పార్టీ శ్రేణుల్లోనే చర్చ సాగుతోంది. కొందరు ఎక్స్‌లోనూ పోస్టులు పెడుతున్నారు. గాయత్రి మాట్లాడిన అంశంలో ఎలాంటి తప్పులేదని ఈ పోస్టుల్లో పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తమ మద్దతు వల్లే కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నడుస్తోందని అయినా బిజెపి,ఆర్ఎస్ఎస్‌కు తలొగ్గాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐదుగురు వైసిపి రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. సంఖ్యాబలం ప్రకారం టిడిపి మూడు, బిజెపి, జనసేనకు చెరొకటి దక్కాల్సి ఉంది. అయితే వీటిల్లో టిడిపితో సమానంగా బిజెపి వాటా దక్కించుకుంది. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ ఏకంగా తమ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో తలదూరుస్తోందన్న అభిప్రాయం ఆ పార్టీ శ్రేణుల్లోనే వినిపిస్తోంది.

టిడిపి అధికార ప్రతినిధి గాయత్రిని తొలగించాలని చంద్రబాబును, లోకేష్‌ను డిమాండ్ చేస్తూ 'హిందూ ఐటి సెల్' చేసిన పోస్టు

కార్మికుల బాగోగులు చూస్తున్నాం

- టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మికుల బాగోగులకు తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యత ఇస్తోందని ఆ పార్టీ నేతలు అన్నారు. మేడే సందర్భంగా టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యాక్రమంలో శాసనమండలి చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కార్మిక వ్యవస్థ నానాటికి పుంజుకుంటోందని అన్నారు. 2017లో కోటి మందికి బీమా ఇప్పించిన ఘనత చంద్రబాబుదే అని చెప్పారు.

ప్రభుత్వ సలహాదారులు ఎన్ఎండి షరీఫ్ మాట్లాడుతూ కార్మికులు పార్టీకి పట్టుకొమ్మలు అని అన్నారు. సంఘటిత కార్మికుల్లో పట్టు సాధించాలని, వారికి సంక్షేమ కార్యక్రమాలు అందించాలని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ వైసిపి హయాంలో నిర్మాణరంగం కుదేలైందని, భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారని అన్నారు. బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ మాట్లాడుతూ కార్మికులకు కూటమి పాలనలో పెద్దస్థాయిలో మంచి జరుగనుందనే విశ్వాసాన్ని ప్రజల్లో కలగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశానికి పట్టుగొమ్మలువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1540వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. తొలుత దీక్షా శిబిరంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రగతిలో భాగస్వాములైన కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని పిలుపునిచ్చారు.

ఉగ్రవాదం, మతోన్మాదం కార్మికవర్గ ఐక్యతకు ప్రమాదం

- రాష్ట్రంలో మతోన్మాద ప్రమాదం పెరుగుతోంది
- ప్రజలను చీల్చకుండా చూడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదే
- శ్రామికవర్గం హక్కులు నిలబెట్టుకునేందుకు పోరాడాలి
- మేడే వేడుకల్లో సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెహల్గాంలో ఉగ్రవాద దాడి నేపథ్యంలో దేశం యావత్తు ఒక్కతాటిపై నిలబడి ఎదుర్కోవాల్సి ఉండగా దీనికి మతం రంగు పులిమి ప్రజల్లో విద్వేషాల్లో పెంచి విభజించడం దేశ భద్రతలకు, ఐక్యతకు ప్రమాదమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు హెచ్చరించారు. మేడే సందర్భంగా గురువారం ఉదయం సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ సీనియర్ నేత బిఆర్ తులసీరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూడా ఈ ప్రమాదం పెరుగుతోందని అన్నారు. రాష్ట్రంలో హిందూ, ముస్లిం పేరుతో విభజన తీసుకొచ్చి దేశాన్ని బలహీన పరిచే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ప్రజలను చీల్చి ఒకరిపై ఒకరిని రెచ్చగొట్టి ఐక్యతను బలహీనపరిచే వ్యాఖ్యానాలు రాష్ట్ర ప్రభుత్వ పెద్ద పదవుల్లో ఉన్నవారు చేయకుండా చూడటంతో పాటు. రాష్ట్రంలో మతోన్మాదులు పెట్రేగిపోకుండా, అబద్ధాలతో ప్రజలను రెచ్చగొట్టకుండా ఐక్యంగా ఉండేలా చేయాల్సిన బాధ్యత కూడా ముఖ్యమంత్రిపై ఉందని చెప్పారు. లౌకిక, వామపక్ష పార్టీలు

ఉగ్రవాద దాడిని ఖండించడమే కాకుండా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్రం తీసుకునే నిర్ణయానికి సంపూర్ణ మద్దతు ప్రకటించి జాతీయ స్ఫూర్తిని చూపాయన్నారు. ఈ జాతీయ స్ఫూర్తిని బిజెపితో పాటు ఎన్‌డిఎ పార్టీలు కూడా ప్రదర్శించాలని చెప్పారు. దేశంలో కార్మికర్గంపై తీవ్ర దాడి జరుగుతోందన్నారు. తరతరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నిలబెట్టుకునేందుకు ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల మెడపై కత్తిపెట్టి వారిని 200 ఏళ్ల క్రితం నాటి బానిస వ్యవస్థలోకి నెట్టే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. రోజుకు 16 గంటలు, 18 గంటలు పనిచేయాలని ఇన్ఫోసిస్ నారాయణ వంటి కార్పొరేట్లు ఉద్బోధ చేస్తున్నారన్నారు. పనిగంటలు పెంచాలని కోరేవారు కార్మికుల కనీస వేతనాల రెట్టింపుపై మాత్రం నోరుమెదపడం లేదన్నారు. బడా కార్పొరేట్లకు ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు మద్దతు ఇస్తూ వారి దోపిడిని మరింత తీవ్రతరం చేస్తున్నాయని విమర్శించారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికవర్గం మే 20వ తేదిన సమ్మెకు పిలుపునిచ్చాయని, దీనికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. అన్ని ప్రజాసంఘాలు, ప్రజలు సహకరించి సమ్మెను జయప్రదం చేస్తేనే శ్రామిక ప్రజలపై జరిగే దాడిని అడ్డుకోగలమన్నారు. కార్మికులు పోరాటాల బాటపట్టడం వల్లే వేతనాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ పోరాటాలు జరగకుండా ప్రభుత్వాలు నిరంకుశ పద్ధతులు అనుసరిస్తున్నాయన్నారు. కార్మికుల చైతన్యాన్ని పక్కదారి పట్టించేందుకు మతప్రాతిపదికన దేశాన్ని విభజిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ కేంద్రకమిటీ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్మికులను బానిసలుగా చేసి పనిచేయించుకునే ప్రమాదం రోజురోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బూర్జువా వర్గం తన భావజాలాన్ని, ఆలోచనలను కార్మిక, మధ్య తరగతి ప్రజలపై రుద్దుతోందన్నారు. బూర్జువా వర్గం చెబుతున్న అంశాలే అభివద్ధి అనే భ్రమల్లో ఉన్నారన్నారు. అమరావతి రాజధానిలో విమానాశ్రయం పేరుతో మరో 44 వేల ఎకరాలను కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. కార్మిక, శ్రామికవర్గం బలహీనంగా ఉన్న సమయంలో రైతాంగ భూములను పారిశ్రామికరణ పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం సాగుతోందన్నారు. నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్న యువతను, శ్రమకు తగ్గ ఫలితం లేని మహిళలను పోరాటాలకు సంసిద్ధం చేయాలని చెప్పారు. రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ మూడో సారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ అమలు చేస్తామని కార్మికవర్గానికి సవాల్ విసురుతోందన్నారు. ఈ కోడ్‌లను ప్రతిఘటిస్తూ ఈ నెల 20వ తేదిన జరిగే దేశవ్యాప్త సమ్మెలో ప్రజలు, కార్మికవర్గం అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్రకమిటీ సభ్యులు జె.జయరాం, ఎం.సూర్యారావు, యు.వి. రామరాజు, జి.రామన్న తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రజానాట్యమండలి కళకారులు పాటలు పాడారు.

సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్ద ఎర్రజెండాను ఎగురవేస్తున్న వి శ్రీనివాసరావు

ఉపాధి పథకం రాష్ట్రానికి వరం

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకం రాష్ట్రానికి ఒక వరమని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అన్నారు. మేడే సందర్భంగా మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 'ఉపాధి కార్మికులతో ఆత్మీయ కలయిక' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, అప్పుల పాలైన రాష్ట్రానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి నిధులు ప్రాణవాయువులా మారాయన్నారు. గత ఏడాది ఉపాధి పథకంలోనే రూ.10,669 కోట్లు ఖర్చు చేశామన్నారు. వేతనాల రూపంలో రూ.6,194 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. శ్రామికులే లేకపోతే దేశ ప్రగతి ముందుకు సాగదన్నారు. ఉపాధి కూలీలను దేశ నిర్మాణానికి చమటోడ్చే శ్రామికులుగా గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి వారిని ఉపాధి శ్రామికులుగానే పేర్కొంటామన్నారు. ఉపాధి పథకంలో 46.94 లక్షల కుటుంబాల్లో 75.23 లక్షల మంది శ్రామికులు వారి సొంత గ్రామాల్లోనే ఉపాధి పొందుతున్నారని తెలిపారు. గత ఏడాది 24.23 కోట్ల పని దినాలు కల్పించామని, 5.10 లక్షల కుటుంబాలకు వంద రోజుల పని చేసినట్లు చెప్పారు. ఈ పథకంలో మొట్టమొదటిగా వేతనాలు పెంచింది సిఎం చంద్రబాబు అని చెప్పారు. వేతనాలు రూ.307కు పెంచి ఇవ్వాలని కోరితే సిఎం వెంటనే అనుమతించారని చెప్పారు. పని ప్రదేశాల్లో గ్రామ పంచాయతీల సహకారంతో తాత్కాలికంగా పందేళు వేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పల్లె పండుగలో భాగంగా 377.37 కోట్లతో 21,564 గోకులాలు పూర్తి చేశామని, రూ.60.75 కోట్ల వ్యయంతో 13,500 పశువుల నీటి తొట్టెలు నిర్మించామన్నారు. 317.91 కోట్లతో 63,582 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచినట్లు చెప్పారు. ఉపాధి శ్రామికులకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన పథకం అమలు కావడం లేదనే విషయాన్ని గుర్తించి ఒకే రోజు కోటి మందికి బీమా నమోదు చేసినట్లు తెలిపారు. దీంతో పని సమయంలో ప్రాణాలు కోల్పోయిన శ్రామికులకు రూ.2 లక్షల పరిహారం లభిస్తుందని చెప్పారు. ఉపాధి సిబ్బందికి రూ.3 నుంచి 30 లక్షల బీమా సౌకర్యం కల్పించేందుకు ఎస్‌బిఐతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. నీటి సంక్షోభాన్ని అధిగమించడానికి, పంచాయతీరాజ్ శాఖ బలంగా పని చేయడానికి వార్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. వర్షపు నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని, ఇందుకు ప్రతి నిర్మాణంలో వర్షపునీటి హార్వెస్టింగ్ పద్ధతి పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉపాధి పథకం శ్రామికులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, ఎన్ఆర్ఇజిఎస్ డైరెక్టర్ షణ్ముఖ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు అవాస్తవాలు

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'ఉపాధి కార్మికుల ఆత్మీయ కలయిక'లో గురువారం చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఉపాధి శ్రామికులకు అత్యధిక వేతనాలు చెల్లించే రాష్ట్రాల్లో కేరళ, హరియాణా మొదటి రెండు స్థానాల్లో ఉండగా, రాష్ట్రం 9వ స్థానంలో ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ రంగంలో శ్రామికులకు కనీస వేతనం రోజుకు రూ.400 ఇవ్వాలని పార్లమెంటరీ స్థాయి సంఘం నివేదిక ఇచ్చిందని, రాష్ట్రంలో రోజుకు రూ.450 ఇవ్వాలని చట్టంలో ఉంటే ఉపాధి పథకంలో శ్రామికులకు కేవలం రూ.307 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రతి ఏటా వినియోగదారుల ధరల సూచి ప్రకారం రూ.5 నుంచి 7 మాత్రమే వేతనం పెరుగుతుందని తెలిపారు. ఉపాధి పథకంలో సమ్మర్ అలవెన్స్, మంచినీళ్లు, పనిముట్లు, ఎండ నుంచి కాపాడుకోవడానికి టెంట్లు వంటి సౌకర్యాలను ఈ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతే కాకుండా ఉపాధి పథకంలో యంత్రాలు, కాంట్రాక్టర్లను ఉపయోగించరాదని చెప్పినా రాష్ట్రంలో ఈ పథకం నిధులతో వేల కిలోమీటర్ల సిసి రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల పేదల కడుపు కొట్టి కాంట్రాక్టర్ల జేబులు నింపుతున్నారని అన్నారు. మరోవైపు ఇప్పటికీ రాష్ట్రంలో రూ.700 కోట్ల వరకూ పేదలు చేసిన పనికి కేంద్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదన్నారు. ప్రతి ఏటా ఉపాధి పథకానికి బిజెపి ప్రభుత్వం నిధుల కేటాయింపు తగ్గిస్తూ వస్తుందని, వీటి గురించి మాట్లాడకుండా చేయలేని దాని చేసినట్లు, ఎక్కడా లేని ఆదర్శం ఇక్కడే ఉన్నట్లు ఉపముఖ్యమంత్రి మాట్లాడటం సరికాదన్నారు. ఉపాధి శ్రామికులకు ఇరువైపులా అధికారులను కూర్చోబెట్టి శ్రామికులతో పచ్చి అబద్దాలు పలికించారని తెలిపారు.

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 269 | విజయవాడ, శుక్రవారం 2 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 2 May 2025 | Rs



క్యూబాపై అమెరికా సాగిస్తున్న ఆర్థిక దిగ్బంధనాన్ని వ్యతిరేకిస్తూ హవానాలో మేడే సందర్భంగా శ్రామికలోకం మహా ప్రదర్శన

ఇంటికో పారిశ్రామిక వేత్త..

రైతులు కూడా ఎంఎస్‌ఎంఇలు పెట్టాలి

- 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం
- జూన్‌లో 86 వేల కొత్త పింఛన్లు
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఆత్మకూరు మండలం నారంపేటలో పైలాన్‌ను ప్రారంభిస్తున్న సిఎం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఇంటికో పారిశ్రామికవేత్తలను తయారుచేయడమే ఎన్‌డిఎ ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఒక్కరోజు పర్యటన నిమిత్తం నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గానికి గురువారం ఆయన వచ్చారు. నియోజకవర్గంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో ప్రజల నుద్దేశించి మాట్లాడారు. నారంపేట ప్రాంతంలో ఏర్పాటు చేసిన 11 ఎంఎస్‌ఎంఇ పార్కులను వర్చువల్‌గా ప్రారంభించారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో ఆయన మాట్లాడుతూ ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారుచేయడమే ఎన్‌డిఎ ప్రభుత్వ లక్ష్యమని అందులో భాగంగానే 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్‌ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు కూడా ఎంఎస్ ఎంఇ పార్కులు పెట్టవచ్చునని, అందుకు అవసరమైన అనుమతులు ఇస్తామని తెలిపారు. పదెకరాల్లో నానో పార్కు, వందెకరాల్లో ఎంఎస్‌ఎంఈ , వంద ఎకరాలకు పైగా ఉంటే మేజర్ పార్కులు ఏర్పాటు చేసుకోవచ్చునని, అలాగే ఆడబిడ్డలు కూడా ఇండస్ట్రీలు పెట్టి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. అంతకుముందు ఆత్మకూరు చేరుకున్న సిఎంకు మంత్రులు స్వాగతం పలికారు. అక్కడి నుండి నేరుగా నెల్లూరుపాలెం వెళ్లిన సిఎం ఒక గిరిజన కుటుంబాన్ని పలకరించారు. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భర్తను కోల్పోయిన సుష్మితకు పింఛన్ అందజేశారు. ఆమెకు డిఎస్‌సి కోచింగ్ ఇప్పించాలని, ఆమె కుమార్తెను గురుకుల పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ ఒ. ఆనంద్‌ను ఆదేశించారు. అక్కడ నుంచి ఓ కళ్యాణ మండం వద్ద కూలీ పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులను సిఎం కలిశారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా వారిని కలవడం ఆనందంగా ఉందన్నారు. వారితో మాట్లాడి వారు చేస్తున్న పనులు పరిశీలించారు. పార పట్టి కార్మికులకు మట్టి పోశారు. ఎండలో కార్మికులు పడుతోన్న కష్టాన్ని చూసి, భవన నిర్మాణ కార్మికులకు ఎప్పుడు పని ఉండేలా చూస్తానని హామీ ఇచ్చారు. వారు అడిగిన చిన్న చిన్న పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అనంతరం టిడిపి కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు.

175 ఎంఎస్‌ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తాం ..

అంతకు ముందు నారంపేట ప్రజావేదికలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత పాలకుల నిర్వాకంతో భవన నిర్మాన కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని, వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. నారంపేటలో ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని,. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ ఎంఇ పార్కులు ఏర్పాటు చేయబోతున్నామని,. ఎవరైనా సరే నేరుగా వచ్చి ఫ్యాక్టరీ పెడితే చాలు. మిగిలిన కరెంటు, షెడ్ల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాలన్నీ మిగతా 7లో

కదం తొక్కిన కార్మిక లోకం

- ట్రంప్ విధానాలపై కన్నెర్ర
- ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఘనంగా మేడే
- హక్కులు, డిమాండ్లపై నినదించిన శ్రమజీవులు

టోక్యో, లాస్‌ఏంజెల్స్, పారిస్ : మేడే సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా కార్మిక లోకం కదం తొక్కింది. తమ హక్కులు, డిమాండ్ల కోసం నినదించింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో కార్మికులు ర్యాలీలు, నిరసనలు, ప్రదర్శనలతో హోరెత్తించారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభ భయాలను రేకెత్తిస్తున్న దూకుడు సుంకాల నుంచి వలసల అణచివేతల వరకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎజెండాకు అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా కార్మికులు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా జపాన్, తైపే, ఫిలిప్పిన్స్, ఫ్రాన్స్, ఇండోనేషియా, అమెరికా, నేపాల్, జర్మనీ సహా పలు దేశాల్లో ర్యాలీలు, నిరసనలు, ఆందోళనలు జరిగాయి. ఈ నిరసన కార్యక్రమాల్లో లక్షలాది మంది పాల్గొన్నారు. ట్రంప్ అనుసరిస్తున్న తీరు, విధానాల పట్ల తమ వ్యతిరేకతను చాటిచెప్పారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న ఘర్షణలు, యుద్ధాలు, దాడులు వంటి అంశాలు కూడా ఈ ప్రదర్శనల్లో ప్రతిబింబించాయి. శాంతి, సమానత్వం నెలకొనాలని, రాజకీయ స్వేచ్ఛ కావాలని కార్మికులు నినదించారు.

టోక్యో నుండి తైపే, మనీలా వరకు ఆసియా వ్యాప్తంగా పలు దేశాల్లో కార్మికులు నిరసనలు చేపట్టారు. ట్రంప్ విధానాలతో నెలకొన్న అనిశ్చితులను వేలెత్తి చూపారు. అన్ని దేశాల ర్యాలీల్లోనూ ట్రంప్ ఎజెండానే కీలకమైన అంశంగా మారింది. ఈసారి తమ దృష్టి అంతా ట్రంప్ వైఖరిపైనే అని అమెరికాలో నిర్వాహకులు ప్రకటించారు. ఈ టారిఫ్‌ల యుద్ధంతో స్థానిక పరిశ్రమలన్నీ బేజారెత్తుతున్నాయని తైవాన్, ఫిలిప్పీన్స్‌ల్లో కార్మిక నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. జపాన్ రాజధాని టోక్యోలో జరిగిన ప్రదర్శనలో ట్రంప్‌ను పోలి వుండేలా బొమ్మను ట్రక్కుపై నుండి వేలాడదీస్తూ ప్రదర్శన సాగించారు. ట్రంప్ విధానాలతో ప్రపంచ రాజకీయాలన్నీ ప్రభావితం కావడాన్ని ఫ్రెంచ్ యూనియన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ట్రంప్‌ను పోలి ఉన్న బొమ్మను టురిన్ వీధుల్లో ఊరేగించారు. దూకుడుగా సుంకాల నుంచి వలసల అణచివేతల వరకు ప్రపంచ ఆర్థిక సంక్షోభ భయాలను రేకెత్తిస్తున్న ట్రంప్ ఎజెండాపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఫ్రాన్స్‌లో జరిగిన నిరసనల్లో వామపక్ష నాయకుడు జీన్-లూక్ మెలెన్‌చాన్ కనిపించారు. ఐరోపాలో అమెరికా సైనిక, వాణిజ్య ప్రభావంపై పెరుగుతున్న ఆగ్రహం ఆ నిరసనల్లో ప్రతిబింబించింది. ప్రపంచ అస్థిరతకు ఆజ్యం పోయడంలో అమెరికా పాత్రను ఖండిస్తూ పలువురు నేతలు ప్రసంగాలు చేశారు.

ట్రంప్ సుంకాలతో ప్రజల జీవనోపాధికి దెబ్బ

ట్రంప్ విధిస్తున్న కొత్త సుంకాలను తైవాన్ అధ్యక్షుడు లై చింగ్-టే విమర్శించారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు, టారిఫ్ యుద్ధాలు, స్థానిక పరిశ్రమలను, ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తాయని ఫిలిప్పీన్స్ నాయకుడు మోంగ్ పలాటినో ఆందోళన వ్యకం చేశారు. జపాన్ రాజధాని టోక్యోలోనూ ఆందోళనలు జరిగాయి. ఇక్కడ జరిగిన ఒక మార్చ్‌లో ట్రంప్‌ను పోలి ఉండేలా తయారు చేసిన బొమ్మ ట్రక్కుపై వేలాడుతూ కనిపించింది. అధిక వేతనాలు, లింగ సమానత్వం, ఆరోగ్య సంరక్షణ, విపత్తుల నుండి ఉపశమనం, గాజాలో కాల్పుల మిగతా 7లో

వెల్లడైన డొల్లతనం!

- నాలుగు రోజుల్లో నాసిరకం గోడ నిర్మించడంతోనే ఏడుగురు బలి
- గోడకు పిల్లర్లు లేవు
- సామగ్రిని ల్యాబ్‌లో పరీక్షించలేదు
- 'సింహాచలం' ప్రమాదంపై త్రిసభ్య కమిటీ విచారణ ప్రారంభం
- కాంట్రాక్టరు, ఇంజినీర్లపై ప్రశ్నల వర్షం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

సింహాచలంలో అప్పన్న చందనోత్సవం సందర్భంగా గోడ కూలి ఏడుగురు మరణించిన ఘోర దుర్ఘటనపై వాదనలు, వివాదాలు, ఆరోపణలు అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్రస్థాయిలో కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ గురువారం విచారణ ప్రారంభించింది. మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ నేతృత్వాన రాష్ట్ర ఈగల్ విభాగాధిపతి ఐజి ఆకే రవికృష్ణ, జలవనరుల శాఖ ఇంజనీరు ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావుతో కూడిన ఈ కమిటీ ప్రమాదం జరిగిన చోటును గురువారం పరిశీలించింది. కొండపై గోడ నిర్మాణం చేసిన కాంట్రాక్టరు, డిఇ, ఇఇలపై కమిటీ సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. గోడ నిర్మాణం పిల్లర్ లేకుండా చేశానని కాంట్రాక్టరు అంగీకరించారు. అందుకు తన మెడపై దేవాలయ ఇంజనీర్లు కత్తిపెట్టారని తెలిపారు. నిర్మాణ సామగ్రిని ల్యాబ్‌ల్లో

సింహాచలంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

పరీక్షించకుండా చందనోత్సవం ఉందంటూ నాసిరకంగా గోడను నిర్మించేలా కాంట్రాక్టరుపై ఒత్తిడి తేవడంతో ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకున్నట్టు స్పష్టమవుతోంది. కాంట్రాక్టర్‌ను కొండపై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెబుతూ 'నాపై ఇంజనీర్లు తీవ్ర ఒత్తిడి చేశారు. చందనోత్సవం ఉంది. తక్షణం గోడ కట్టేయాలి' అని పలుమార్లు చెప్పారు. నేను పనిని ఆపేసినా ఒత్తిడి మిగతా 7లో

ప్రధాని సభకు ఏర్పాట్లు పూర్తి

- సభా వేదికను పరిశీలించిన మంత్రులు
- 25 బస్సులకు ఒక ఇన్‌ఛార్జిని నియమించినట్లు వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభా వేదికతో పాటు, సభకు హాజరయ్యే వారందరికీ అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మంత్రులు ప్రకటించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనూహ్యంగా వర్షం పడినా ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర సభావేదికను పరిశీలించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా అన్ని రక్షణ ఏర్పాట్లూ తీసుకున్నట్లు తెలిపారు. సభకు ప్రజలను తీసుకొచ్చే బస్సులకు ఒక అధికారిని ఇన్‌ఛార్జిగా పెట్టామని, 25

ఏర్పాట్లను సమీక్షిస్తున్న మంత్రులు

బస్సులకు ప్రత్యేక ఇన్‌ఛార్జి మరొకరు ఉంటారని తెలిపారు. బస్సు బయలుదేరే సమయానికే అల్పాహారం, తాగునీరు, మధ్యహ్న భోజనం వంటి సదుపాయాలన్నీ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పార్కింగు ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలను నియమించామని తెలిపారు. రాజధాని పనుల పున: ప్రారంభాన్ని ప్రతి ఒక్కరూ తమ సొంత కార్యక్రమంగా భావించేలా చూస్తామన్నారు. పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ మట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణానికి 29 గ్రామాల ప్రజలు 34 వేల ఎకరాలు ఇచ్చారని, వారందరినీ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణంతో ప్రజల ఆర్థికస్థితి మెరుగుపడుతుందని, ఆదిశగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అమరావతి రాజధాని పనులు పున:ప్రారంభానికి ప్రధాని వస్తున్న నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సదుపాయాలు కల్పించామని వివరించారు. రాజధాని మనది అనే భావన అందరిలో వచ్చేలా చూస్తున్నామని చెప్పారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాట ఆడిందన్నారు. ఇప్పుడు అమరావతి పనులను తిరిగి ప్రారంభించుకుంటున్నామని చెప్పారు. అనంతరం సభ వేదిక, పైలాన్ ఏర్పాట్లను చూశారు. మంత్రుల బృందంతో నోడల్ అధికారి వీరపాండ్యన్, సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తప్పని డోలీ కష్టాలు

- మార్గ మధ్యలో గిరిజన గర్భిణి ప్రసవం

5

దిగివస్తోన్న బంగారం ధర

- మరో రూ.2160 తగ్గుదల

మామిడి ధర దిగ్గోత

- విక్రయానికి దళారులపైనే ఆధారం
- దిగుబడి కూడా తగ్గుదల

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గిపోయింది. మరోవైపు స్థానికంగా ప్రత్యేక మార్కెట్ సదుపాయం లేకపోవడంతో పూర్తిగా దళారులపై ఆధారపడాల్సి వస్తుండడంతో సరైన ధర లభించడం లేదని మామిడి రైతులు, లీజుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8.55 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఇందులో ఉమ్మడి చిత్తూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉండగా,, ఉమ్మడి విజయనగరం జిల్లా సుమారు లక్షా 25 వేల ఎకరాల్లో సాగుతో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ ప్రాంతంలో చాలామంది చిన్నరైతులే ఉన్నారు. మామిడి మార్కెట్‌పై అవగాహన ఉన్న రైతులు మిగిలిన రైతుల వద్ద లీజుకు తీసుకుని సాగు చేస్తున్నారు. మధురమైన బంగినపల్లి, నోరూరించే సువర్ణరేఖ, చెరుకు రసాలు, పనుకులు వంటి ఎన్నో రకాల మామిడి పండ్లకు విజయనగరం ప్రసిద్ధి. ఉమ్మడి విజయనగరం జిల్లా భౌగోళికంగా చిన్నదైనప్పటికీ మామిడి సాగులో మాత్రం రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది. ఇక్కడి భూసారాన్ని బట్టి ఎకరాకు 8 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి రావాలి. గతేడాది 6 నుంచి 8 టన్నుట వరకూ వచ్చింది. ఈ ఏడాది 5 నుంచి 6 టన్నులు మాత్రమే వస్తోందని రైతులు చెప్తున్నారు..అధికారిక లెక్కల ప్రకారం పనుకులు కోత ఇప్పటికే 80 శాతం పూర్తి అయింది. మిగిలిన రకాల మామిడి కాయల కోత ముమ్మరంగా సాగుతోంది. సువర్ణ రేఖ 50 శాతం, కలెక్టర్ 40 శాతం, బంగినపల్లి 20 శాతం కోతలు పూర్తయ్యాయి.

పూత దశలోనే దెబ్బ

రకాన్ని బట్టి రెండు నుంచి నాలుగు దశల్లో పూతకు వస్తాయి. డిసెంబర్‌లో సాధారణ వర్షపాతం 4.1 మిల్లీమీటర్లు కాగా, 151 మిల్లీమీటర్లు నమోదైంది. అధిక వర్షపాతం, జనవరి, ఫిబ్రవరిలో పొగమంచు, రాత్రి పూట ఉష్ణోగ్రత బాగా తగ్గడంతో పూత సరిగా నిలబడలేదని రైతులు, అధికారులు చెబుతున్నారు. పిందె కట్టే సమయంలో తామర పురుగు, బూడిద తెగులు తేనెమంచుపురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో, దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది.

మార్కెట్ సదుపాయం లేక అవస్థలు

ఈ ప్రాంత మామిడి ఎంతో రుచికరంగా ఉండడంతో ఇక్కడి నుంచి కోల్‌కత్తా, ఢిల్లీ, ముంబయి, చెన్నై, రూర్కెలా, రాయ్‌పూర్ వంటి మహానగరాలకు రైళ్ల ద్వారా ఎగుమతి అవుతుంటాయి. స్థానికంగా ప్రభుత్వం తరపున మార్కెట్ సదుపాయం లేకపోవడంతో ఇక్కడి మామిడి రైతులు పూర్తిగా దళారులపై ఆధారపడాల్సి వస్తోంది. దీన్ని అధిగమించేందుకు విజయనగరం శివార్లో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని మూడు దశాబ్దాల క్రితం ప్రత్యేకంగా మామిడి మార్కెట్ యార్డు నిర్మించినప్పటికీ రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడం వల్ల నిరుపయోగంగా మారింది.

ధర విషయంలోనూ నిరాశే

ఉత్పత్తి తగ్గినప్పుడు ధర, డిమాండ్ పెరగడం సహజం. కానీ, మార్కెట్ సదుపాయం లేకపోవడం వల్ల దళారులు నిర్ణయించిందే ధర అన్నట్టుగా ఉంది. గతేడాది టన్ను రూ.80 వేల పలికిన సువర్ణరేఖ ధర ఈ ఏడాది రూ.60 వేల నుంచి రూ.70 వేలకు మించి కొనడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కోత దశకు చేరిన బంగినపల్లి టన్ను రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఉంది. గతేడాది రూ.1.20 లక్షల నుంచి 1.40 లక్షల వరకూ పలికింది. దాదాపు ఈ రకాలన్నీ ఢిల్లీ, కోల్‌కత్తా, రాయ్‌పూర్ తదితర మార్కెట్లలో 15 శాతం నుంచి 20 శాతం వరకు ఎక్కువ ధరలే పలుకుతున్నాయి.

స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించాలి

ఎంతో కష్టపడి మామిడి తోటలను సాగు చేస్తున్నప్పటికీ స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో దళారులపై ఆధారపడాల్సి వస్తోంది. వారు సరైన ధర ఇవ్వడం లేదు. ప్రభుత్వం స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించి మామిడి రైతులను ఆదుకోవాలి.

-పెంటపల్లి సత్యనారాయణ, బుడతనాపల్లి, గంట్యాడ మండలం

ఓటర్ల జాబితాతో మరణ రికార్డులు అనుసంధానం

ఆర్‌జిఐ నుంచి సమాచారం తీసుకుంటామన్న ఇసి

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితాను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) కీలక నిర్ణయం తీసుకుంది. భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జిఐ) నుంచి మరణాల సమాచారం కోరనున్నట్లు ఇసి గురువారం తెలిపింది. ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా ఉండేందుకు, వేగంగా, మరింత కచ్చితంగా మార్పులు చేసేందుకు ఆర్‌జిఐ నుంచి మరణాల సమాచారాన్ని ఎలక్ట్రానిక్‌గా పొందనున్నట్లు తెలిపింది. అందువల్ల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఇఆర్‌ఒలు) మరణాల గురించి సకాలంలో సమాచారం అందుకుంటారని పేర్కొంది. మరణించిన వారి బంధువుల నుండి ఫారమ్ 7 కింద అధికారిక అభ్యర్థన వచ్చే వరకు వేచి చూడకుండా బూత్‌స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధ్రువీకరించడానికి వీలు కలుగుతుందని ఇడి వివరించింది. 1960 ఓటర్ల నమోదు నిబంధనలు, 1969 జనన మరణాల నమోదు చట్టం ప్రకారం ఇటువంటి సమాచారం వివరాలను కోరే, సేకరించే అధికారం ఇసికి ఉంది. ఈ ఏడాది మార్చిలో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లు (సిఇఒలు)తో జరిగిన సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి తీసుకున్న నిర్ణయాల మేరకు ఇసి ఈ తాజా చర్యకు ఉపక్రమించింది. ఓటరు సమాచార స్లిప్ (విఐఎస్)లను ఓటర్లకు అనుకూలంగా మార్చేందుకు కొత్త డిజైన్‌లను రూపొందించాలని కూడా నిర్ణయించినట్లు తెలిపింది. ఓటర్ సీరియల్ నెంబర్, పార్ట్ నెంబర్ మరింత స్పష్టంగా కనిపించేలా ఫాంట్ సైజ్‌ను పెంచనున్నామని, దీంతో ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్‌ను సులభంగా గుర్తించవచ్చని, పోలింగ్ అధికారులు కూడా ఓటర్ల జాబితాలో వారి పేర్లను సమర్థవంతంగా గుర్తించవచ్చని పేర్కొంది. ఇఆర్‌ఒలు నియమించే బిఎల్‌ఒలకు ప్రామాణిక ఫొటో గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఇసి నిర్ణయించింది. ఓటర్లతో ముందుగా ముఖాముఖి అయ్యేది బిఎల్‌ఒలే కాబట్టి, వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు అవసరమని తెలిపింది. ఓటరు ధ్రువీకరణ, నమోదు వంటి డ్రైవ్‌ల సమయంలో బిఎల్‌ఒలను ప్రజలు సులభంగా గుర్తించడానికి, వారితో నమ్మకంగా సంభాషించడానికి ఈ ఫొటో గుర్తింపు కార్డులు ఉపయోగకరంగా ఉంటాయని కేంద్ర ఎన్నికల సంఘం వివరించింది.

సంపాదకీయం

ఎట్టకేలకు...

జనాభా లెక్కల సేకరణలో కులగణననూ చేపట్టాలని కేంద్ర మంత్రివర్గం బుధవారం నిర్ణయం తీసుకుంది. అసలు చేయకుండా ఉండడం కంటె ఆలస్యంగానైనా చేయడం మంచిది (లేట్ ఈజ్ బెటర్ దేన్ నెవర్) అన్న సామెత ఇందుకు సరిగ్గా సరిపోతుంది. ఎన్నో ఏళ్లుగా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా ఎప్పటికప్పుడు ఏవేవో సాకులు చెప్పి దాన్ని తోసిపుచ్చుతూ వచ్చిన కేంద్ర పాలకులు ఇప్పటికి దేశవ్యాప్త కులగణనకు ఆమోదం తెలిపారు. సాధారణ జనగణనలో సేకరిస్తున్న షెడ్యూల్డు కులాలు, తరగతుల వారివి తప్ప ఇతర వెనుకబడిన తరగతులవారి వివరాలు ఆ విధంగా రావడంలేదు. వారికి సంబంధించిన వాస్తవ సమాచారం అధీకృతంగా రావడం అవసరం. కులానికి, విద్యా సామాజికార్థిక అభివృద్ధికీ గల సంబంధాన్ని తెలుసుకోవడానికి కులగణన దోహదపడుతుంది. దేశ ప్రజలందరికీ సంబంధించిన వివరాలన్నీ ఉంటేనే విధాన రూపకర్తలు అభివృద్ధికి తగిన ప్రణాళికలు, పథకాలు రూపొందించడం సాధ్యమవుతుంది. అంతేగాక ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రభావం వివిధ తరగతులపై ఎలా వుందన్నదీ విదితపడుతుంది. కాబట్టి శాస్త్రీయమైన రీతిలో ఎస్సీ ఎస్టీలతో సహా ఒబిసిల వివరాలతో దేశవ్యాప్త జన గణన నిర్వహించడం ఎంతో అవసరం.

ఇప్పటికే బీహార్, కర్ణాటక, తెలంగాణ వంటి కొన్ని రాష్ట్రాలు కులగణన చేపట్టాయి. ఆ వివరాలకున్న చట్టబద్ధతపై సందేహాలున్నా ఆయా రాష్ట్రాల్లో సంబంధిత కులాలకు చెందిన ప్రజల స్థితిగతులు తెలుసుకోవడానికవి దోహదపడ్డాయన్నది నిర్వివాదాంశం. దేశవ్యాప్తంగా కుల గణనకు కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం తమ విజయమేనని ప్రతిపక్షాలు ప్రకటనలు చేశాయి. కేంద్రాన్ని కులగణనకు తలొగ్గేలా చేయడంలో ఒకవిధంగా అవి సఫలీకృతమయ్యాయని భావించవచ్చు. తొలుత బీహార్‌లో కుల గణన జరగడానికి, ఇప్పుడు దేశవ్యాప్త కులగణనకు కేంద్రం ఒప్పుకోవడానికి ప్రతిపక్షాల ఆందోళనలు, విస్తృత ప్రజాభిప్రాయమూ పని చేశాయనిపిస్తోంది. కొన్ని రాష్ట్రాలు కులగణను రాజకీయ సాధనంగా వాడుకున్నాయని, కుల గణన నిర్ణయం కేంద్ర ప్రభుత్వం సమాజం, దేశ విలువలు, ప్రయోజనాలకు కట్టుబడి ఉందని నిరూపిస్తుందనీ మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పిన మాటలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. గడచిన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఈ విషయం ఎవరు ప్రస్తావించినా ప్రతిపక్షాలు దేశంలో కులచిచ్చు పెడుతున్నాయని మోడీ-షా ద్వయం మొదలుకొని బిజెపి ఛోటా నాయకుల వరకూ ఎదురుదాడి చేసిన సంగతి ప్రజలకెరుకే! ఇన్నాళ్లూ తిరస్కరిస్తూ వస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఏ జ్ఞానోదయం కలిగి ఈ హఠాత్ నిర్ణయం తీసుకుందో అమాత్యవర్యులు సెలవివ్వలేదు. త్వరలో జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఇందుకు ఒక ప్రధాన కారణమని ఇప్పటికే చాలా కథనాలు వచ్చాయి. అంతేగాక పహల్గాం ఉగ్ర దాడి అనంతర పరిస్థితుల నేపథ్యం కూడా విస్మరించరానిదని ఇంకొన్ని విశ్లేషణలు వచ్చాయి.

దేశంలో జనగణన 2021లో జరగవలసి వుంది. ఆ ప్రక్రియ 2020లోనే ప్రారంభం కావలసి వుండగా కోవిడ్ అనంతరం చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కోవిడ్ పోయి నాలుగేళ్లయినా జనగణన ఊసే లేకపోవడం కేంద్రం చిత్తశుద్ధి లేమికి నిదర్శనం. వాస్తవానికి వలస పాలనాకాలం నుండి దేశంలో ప్రతి పదేళ్లకోసారి జనగణన జరుగుతోంది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో సైతం 1941 జనగణన కొన్ని పరిమితులతో నిర్వహించారు. స్వతంత్ర భారత దేశంలో ప్రతి దశాబ్దానికీ జనగణన సాగింది. నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వమే ఇలా వాయిదా వేస్తూ రావడం విచారకరం. గడచిన పదేళ్ల కాలంలో వివిధ గణాంకాలు, సర్వేల విషయంలో ఈ ప్రభుత్వ తీరు వేరుగా ఉంది. ఆయా గణాంక సేకరణలో ప్రాతిపదికల మార్పు గానీ వివిధ సర్వేల ఫలితాలను తొక్కిపట్టడం లేదా వక్రీకరించడం ఒక విధానంలానే సాగుతోంది. దాని కొనసాగింపుగానే 2021 జనగణన కూడా జాప్యం జరుగుతోందన్నది జనవాక్యం. ఇప్పుడు కులగణన చేయాలన్న నిర్ణయం వెలువడింది కనుక ఆలస్యం చేయకుండా దేశవ్యాప్త జనగణన చేపట్టడం అవశ్యం!

మహనీయుల మాట



నీతి వున్నవారు నిందను గురించి భయపడవలసిన పని లేదు.

- బెర్నార్డ్ షా, ఐరిష్ నాటక రచయిత, విమర్శకుడు.

విశాఖ భూములు కారుచౌకగా కట్టబెడుతున్నారు

విశ్లేషణ

కె.లోకనాథం

ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలనే పేరుతో విశాఖలో అత్యంత విలువైన భూములను అతి తక్కువ ధరలకే కట్టబెట్టే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిగమ్నమైంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో విశాఖలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను చడీచప్పుడు కాకుండా కారుచౌకగా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నది. ఇటీవల టాటా కన్సల్టెన్సీ సర్వీస్ లిమిటెడ్ (టిసిఎస్)కి హిల్ నెంబర్ 3లో 21 ఎకరాల భూములను కేటాయించారు. ఉర్సా కంపెనీకి దాని పక్కన, కాపులుప్పాడలోనూ భూమిని కేటాయించారు. టిసిఎస్ రూ.1370 కోట్ల పెట్టుబడులతో 12 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. టిసిఎస్‌కు ఎకరా 99 పైసలకే కేటాయించినట్లు వార్తలు వచ్చాయి. ప్రతిష్టాత్మక టిసిఎస్ ఇట్లాంటి ఒప్పందానికి ఎలా అంగీకరించింది? ఇది ప్రభుత్వం అత్యుత్సాహమా? వాస్తవం ఏంటనేది ప్రజలకు తెలియజేయాలి. ఆ పక్కనే ఉర్సా కంపెనీకి భూములు కేటాయించడం పట్ల కూడా ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. దీనికి ప్రధాన కారణం ఈ కంపెనీని 2025 ఫిబ్రవరి 12న ప్రారంభించారు. దీనికి కార్పొరేట్ గుర్తింపు (రిజిస్ట్రేషన్ నెంబర్ 193897) ఇచ్చారు. రూ.10 లక్షల పెట్టుబడితో ఏర్పడిన కంపెనీ ఇది. రెండు తెలుగు రాష్ట్రాల్లోను వేల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ఎలా ఒప్పందం కుదుర్చుకున్నారు? ఈ కంపెనీకి ఇద్దరు మాత్రమే డైరెక్టర్లుగా వున్నారు. ఐటి రంగంలో కనీసం గుర్తింపు లేని కంపెనీ. ఇలాంటి కంపెనీకి టిసిఎస్ పక్కనే

ఉమ్మడి విశాఖ పరవాడ ఫార్మా ఎస్‌ఇజెడ్, అచ్యుతాపురం ఎస్‌ఇజెడ్, నక్కపల్లిలో హెటిరో డ్రగ్స్, పాయకరావుపేటలో దక్కన్ కెమికల్స్, మాకవరపాలెంలో అన్‌రాక్ కంపెనీకి (ప్రస్తుతం పెయినరీ) కారుచౌకగా భూములు కేటాయించారు. ఈ కంపెనీల్లో ఎంతమంది స్థానికులకు, ఉత్తరాంధ్ర ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నారో శ్వేతపత్రం ద్వారా ప్రకటించాలి.

కేటాయిస్తే అంతర్జాతీయ గుర్తింపు వస్తుందనే కుట్ర దాగి వుందా? లేదా ఏ లాభాపేక్షతో ఉర్సాకు భూములు కేటాయించారు? ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వంలో అనుకూలురు వుంటే కోట్లాది విలువ చేసే భూములను పొందవచ్చునేది ఉర్సా ఉదంతం తెలియజేస్తున్నది. ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములపై అనేక అనుమానాలను విశాఖ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలను రాష్ట్ర ప్రభుత్వమే ప్రజలకు చెప్పాల్సి వుంది.

ఉర్సా కంపెనీకి కేటాయించిన భూమి అత్యంత విలువైన భూమి. ఈ కంపెనీలతో జరిగిన ఒప్పందాలు అత్యంత రహస్యంగా వుంచాల్సిన దుస్థితి ఎందుకు దాపురించింది? మొదట ఎకరా 99 పైసలకే కేటాయించారని ప్రసార మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. ప్రభుత్వం వెంటనే ఎకరా 99 పైసలకు కాదని బదులిచ్చింది. ఒక కంపెనీతో ఎం.ఒ.యు కుదుర్చుకున్నప్పుడు ఆ కంపెనీ చరిత్ర తెలుసుకోవాలి. చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేస్తుందా? లేదా? అనే విశ్వాసనీయమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా భూములు కేటాయించినట్లు అర్థమౌతుంది.

ఉర్సా క్లస్టర్ అంతర్జాతీయంగా పేరున్న నిపుణులతో ఏర్పాటయిన కంపెనీ అని, ఈ కంపెనీ రూ.5196 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేసి 2500 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. విశాఖ ఐ.టి పార్కు దగ్గర హిల్ నెంబర్ 3లో 3.50 ఎకరాలు, కాపులుప్పాడలో 56 ఎకరాలు, మొత్తంమీద

విశాఖ ఐ.టి పార్కు దగ్గర హిల్ నెంబర్ 3లో 3.50 ఎకరాలు, కాపులుప్పాడలో 56 ఎకరాలు, మొత్తంమీద 60 ఎకరాలు కేటాయించారు. ఈ భూములు వేల కోట్ల రూపాయల ఖరీదైనవి. కాపులుప్పాడలో కేటాయించిన 56 ఎకరాలకు ఎకరా 50 లక్షలకే కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంటే 28 కోట్లకే కేటాయించారు. హిల్ టాప్‌పై ఉన్న 3.50 ఎకరాలను ఎకరా కోటి చొప్పున 3.50 కోట్లకే భూములు కేటాయించారు. ఇంత కారుచౌకగా ఊరు, పేరు లేని కంపెనీకి కేటాయించడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రభుత్వమే చెప్పాలి.

60 ఎకరాలు కేటాయించారు. ఈ భూములు వేల కోట్ల రూపాయల ఖరీదైనవి. కాపులుప్పాడలో కేటాయించిన 56 ఎకరాలకు ఎకరా 50 లక్షలకే కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంటే 28 కోట్లకే కేటాయించారు. హిల్ టాప్‌పై ఉన్న 3.50 ఎకరాలను ఎకరా కోటి చొప్పున 3.50 కోట్లకే భూములు కేటాయించారు. ఇంత కారుచౌకగా ఊరు, పేరు లేని కంపెనీకి కేటాయించడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రభుత్వమే చెప్పాలి. ఇంత అడ్డగోలుగా భూములు కేటాయించి దానిని సమర్థించుకొనే ప్రయత్నం చేయడం దుర్మార్గమైనది.

విశాఖ ఆర్థిక రాజధాని. ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన భూములు, కొండలను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రభుత్వ స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టీగా వుండి పరిరక్షించాల్సింది పోయి పెట్టుబడిదారులకు లీజుల పేరుతో కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారు. భూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ ఆర్కే బీచ్‌లో ఉన్న 13.43 ఎకరాల భూమిని లూలు కంపెనీకి కట్టబెట్టారు. అదాని డేటా సెంటర్‌కు 190 ఎకరాల భూమిని హిల్‌టాప్‌లో కేటాయించారు. గూగుల్ డేటా సెంటర్‌కు తర్లువాడ దగ్గర 250 ఎకరాలు కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా నగరం నడిబొడ్డున విప్రో, సత్యం కంప్యూటర్స్‌కు ఇదే తరహాలో జరిగింది. తరువాత అది టెక్ మహేంద్ర కంపెనీగా మార్పు చెందింది. ఐటి సెజ్ హిల్ టాప్‌లో ఇప్పటికే ఐటి కంపెనీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఏర్పడిన కంపెనీల్లో ఎంత మందికి ఉపాధి కల్పిస్తామన్నారు? ఎంత మందికి కల్పిస్తున్నారు? వంటి వివరాలను బహిర్గతం చేయాలి. ఇలావుండగా, ఇటీవల కాలంలో అక్కడే ఉన్న ఐటి కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులకు సరిగ్గా జీతాల చెల్లింపులు జరగడంలేదని ఆందోళనలకు దిగారు.

ఉమ్మడి విశాఖ పరవాడ ఫార్మా ఎస్‌ఇజెడ్, అచ్యుతాపురం ఎస్‌ఇజెడ్, నక్కపల్లిలో హెటిరో డ్రగ్స్, పాయకరావుపేటలో దక్కన్ కెమికల్స్, మాకవరపాలెంలో అన్‌రాక్ కంపెనీకి (ప్రస్తుతం పెయినరీ) కారుచౌకగా భూములు కేటాయించారు. ఈ కంపెనీల్లో ఎంతమంది స్థానికులకు, ఉత్తరాంధ్ర ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నారో శ్వేతపత్రం ద్వారా ప్రకటించాలి. అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీకి 1000 ఎకరాల భూమిని ఎకరా రూపాయి చొప్పున 99 సంవత్సరాలు లీజుకు ఇచ్చారు. ఆ రోజు శ్రీలంక యాజమాన్యం 60 వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని ఎంఒయు చేసుకుంది. కంపెనీ ప్రారంభమై నేటికి దాదాపుగా 20 సంవత్సరాలయ్యింది. ప్రభుత్వాల నుండి అన్ని రాయితీలు తీసుకున్నా ఇచ్చిన ఉపాధి 22 వేల మందికి మాత్రమే. అతి తక్కువ జీతాలు ఇస్తూ దోపిడీ చేస్తున్నారు. ఇప్పుడు దాని పేరు బ్రాండిక్స్ బదులు ఆదిస్తాన్‌గా మార్చుకుంది. రాయితీలు కావాలంటే ప్రైవేట్ కంపెనీలు ఎన్ని జిమ్మిక్కులు చేయాలో వారికి తెలుసు. కాని రాష్ట్ర ప్రభుత్వం కంపెనీలకు రాయితీలు ఇవ్వకపోతే కంపెనీలు రావని తెగేసి చెబుతున్నది. అందుకే భూములు కేటాయిస్తున్నామని ఎదురుదాడి చేస్తోంది. కంపెనీలకు భూములు కేటాయించటం మా ప్రభుత్వమే కాదు. గత ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవహరించిందని ప్రచారం చేస్తున్నారు. గతంలో విశాఖ భూములపై రెండు ప్రభుత్వాలు వేసిన రెండు సిట్‌ల నివేదికలను నేటికీ బహిర్గతం చేయలేదు. దీనికి కారణం, విశాఖ భూములు కాజేసినదానిలో ఎవరి వాటా వారికి వుండి వుంటుందన్నది జనాంతికం.

ఎ.పి పారిశ్రామికంగా పురోభివృద్ధి చెందాలంటే, ఉపాధి అవకాశాలు రావాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడమే కీలకమైనది. నేడున్న కేంద్ర ప్రభుత్వానికి మన రాష్ట్ర కూటమి ప్రభుత్వం మద్దతు చాలా కీలకమైనది. కూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తే ప్రత్యేక హోదా సాధించవచ్చు. ఫలితంగా అనేక కంపెనీలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలున్నాయి. తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకోవచ్చు.

ఎ.పి పారిశ్రామికంగా పురోభివృద్ధి చెందాలంటే, ఉపాధి అవకాశాలు రావాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడమే కీలకమైనది. నేడున్న కేంద్ర ప్రభుత్వానికి మన రాష్ట్ర కూటమి ప్రభుత్వం మద్దతు చాలా కీలకమైనది. కూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తే ప్రత్యేక హోదా సాధించవచ్చు. ఫలితంగా అనేక కంపెనీలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలున్నాయి. తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా కూటమి నాయకులు ప్రభు భక్తి చాటుకుంటున్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టే విధంగా వ్యవహరిస్తున్నారు.

ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రత్యేక హోదా కోసం అన్ని పక్షాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. విశాఖలో ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములు అత్యంత విలువైనవి. ఈ ప్రాంతం పచ్చని కొండలతో నిండి వుంటుంది. ఇప్పుడు వాటిని ధ్వంసం చేస్తున్నారు. విశాఖ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలి. వికసిత ఆంధ్రప్రదేశ్‌లో పర్యావరణం చాలా కీలకమైనది విజన్ 2047లో రాష్ట్ర ప్రభుత్వం ప్రటించింది. ఈ దృష్ట్యా ఉర్సాకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలి. లేదంటే ప్రజాగ్రహానికి గురికావల్సి వస్తోంది.

/ వ్యాసకర్త సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు /

ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తున్న పాలక వర్గాలు

వ్యాఖ్య

డా॥కత్తి పద్మారావు

విద్య సామాజిక, సాంస్కృతిక పరిణామానికి ప్రధాన వాహిక. ప్రతి తల్లీ తండ్రీ తమ బిడ్డలు విద్యావంతులు కావాలని, తమ కంటే ఇంకా మెరుగ్గా బతకాలని ఆశిస్తారు. విద్య జీవన వ్యవస్థలను పరిపుష్టం చేస్తుంది. విద్య భారతదేశ, రాష్ట్రాల ఆర్థిక జీవనాన్ని మెరుగు పరుస్తుంది. ప్రపంచ దేశాల్లో విద్యావంతులు అందరూ ఆయా దేశాల అభివృద్ధికి, జీవన వ్యవస్థల పునరుజ్జీవనానికి కృషి చేశారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే క్రమంలోను, వచ్చాక విద్యాభ్యాసానికి సంబంధించి ఒక సంస్కరణగా ఒక విప్లవంగా విద్యా విప్లవం నడిచింది. దేశ వ్యాప్తంగా విద్యా వ్యాపారం పెరిగింది. విద్యా విధానం జ్ఞాన సంబంధమైనది. విద్యలో వ్యాపార ధోరణి వుండకూడదు.

ఈనాడు భారతదేశంలో గాని, మన రాష్ట్రంలో కాని ప్రభుత్వ పాఠశాలల్లో దళిత, గిరిజన, బి.సి.ల పిల్లలు, అగ్రకులాల్లోని పేదలు చదువుతున్నారనేది నిష్ఠుర సత్యం. ముఖ్యంగా ఆడపిల్లలు ఎక్కువగా చదువుతున్నారు. 10వ తరగతి నాలుగు లక్షల మంది ప్రభుత్వ బడుల్లో పాసయితే వారు ఇంటర్ మీడియట్ వరకు చదివే ప్రయత్నం చేయడం లేదు. ఇంటర్ మీడియట్‌లో కార్పొరేట్ విద్యను పెంచి వారిని ప్రోత్సహిస్తున్నారు. విద్య ఈనాడు బజారులో అమ్మే సరుకులాగ మారింది. విద్యాశాఖ ప్రైవేటు విద్యకు ప్రోత్సాహం ఇస్తూ ప్రాథమిక విద్యను పునాదుల అంటుతొలిచే ప్రయత్నం చేస్తున్నది.

రాను రాను ప్రభుత్వ బడుల్లో చదివే వారి శాతం తగ్గిపోతున్నది. ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ వివరాలు చూస్తే పాలకుల అశ్రద్ధ, కొందరు అధికారుల స్వలాభాపేక్ష, అవినీతి, వీటన్నింటినీ మించిన రాజకీయ జోక్యంతో విద్యాప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బీదాబిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లోనే దొరుకుతుందనే నమ్మకంతో ఆ వైపు మొగ్గు చూపుతున్నారు. ఏ మాత్రం ఆర్థిక వసతి లేనివారు, మరో దారిలేని వారు విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల బాట పడుతున్నారు. గ్రామాలకు కూడా ఈ ప్రైవేటు విద్యా వ్యాపారం విస్తరిస్తున్నది. ఇక రానురాను ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏమిటనేది ప్రశ్న ఉదయిస్తున్నది. గత దశాబ్ద కాలంగా ఏడాదికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ప్రైవేట్ రంగంలో పెరిగిపోతున్నది.

బీదాబిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లోనే దొరుకుతుందనే నమ్మకంతో ఆ వైపు మొగ్గు చూపుతున్నారు. ఏ మాత్రం ఆర్థిక వసతి లేనివారు, మరో దారిలేని వారు విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల బాట పడుతున్నారు. గ్రామాలకు కూడా ఈ ప్రైవేటు విద్యా వ్యాపారం విస్తరిస్తున్నది. ఇక రానురాను ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏమిటనేది ప్రశ్న ఉదయిస్తున్నది. గత దశాబ్ద కాలంగా ఏడాదికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ప్రైవేట్ రంగంలో పెరిగిపోతున్నది.

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గురుకులాల్లో కూడా ఈ పదేళ్లల్లో విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే తగ్గు ముఖం పట్టినట్లే కన్పిస్తున్నది. ప్రధానంగా కరోనా రక్కసి విజృంభించిన సమయంలో విద్యారంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. చదువుకు స్వస్తి చెప్పిన విద్యార్థులు లక్షల సంఖ్యలో ఉన్నారు. వారిని తిరిగి బడిబాట పట్టించడంలో పాలకులు విఫలమయ్యారనే చెప్పొచ్చు. అందుకు తల్లిదండ్రుల సహకారం కూడా లేకపోవడం కారణం. ఇక అన్ని రకాల ప్రభుత్వ విద్యాసంస్థల్లో పిల్లల సంఖ్య పరిగణనలోకి తీసుకున్నా ఈ పదేళ్ల కాలంలో నాలుగు లక్షల ముప్పై ఏడు వేల మంది తగ్గారని విద్యాశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక ప్రైవేట్ పాఠశాలల్లో ఈ పదేళ్ల కాలంలో 31 లక్షల పదిహేడువేల మంది నుండి ప్రస్తుతం 36 లక్షల డెబ్బై మూడువేల మందికి పెరిగింది. ప్రతి ఏడాది ప్రభుత్వ స్కూళ్ల కంటే ప్రైవేట్ స్కూళ్లల్లో విద్యార్థుల సంఖ్య ఊహించని విధంగా పెరిగిపోతున్నది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎటువైపు దారితీస్తుందో? ఎందుకు ఈ పరిస్థితి దాపురిస్తున్నది? కారకులెవరో? కారణాలు ఏమిటి? అని అటు అధికార వర్గాలకు కానీ, పాలకులకు కానీ తెలియంది కాదు. దీనిపై చర్చోపచర్చలు కూడా జరుపుతున్నారు. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు, కాగితాల వరకు బాగానే ఉంటున్నాయి. ఆచరణకు వచ్చేసరికి అసలు సమస్యలు కారణాలవుతున్నాయి.

నిజానికి దళిత తల్లిదండ్రులకు పిల్లలను చదివించగల్గిన ఆర్థిక శక్తి లేదు. రెక్కాడితేగాని డొక్క నిండని తల్లిదండ్రులు ఎక్కువ మంది ఉన్నారు. వారు పని కోసం వలసలు వెళుతూ వుంటారు. ఒక ఊరి నుండి ఏ రాత్రికో వస్తారు. పిల్లలకు ఆలనా పాలనా వుండదు. పిల్లలు తల్లిదండ్రులు పని నుండి వచ్చే వరకు పిల్లలు బిక్కు బిక్కుమంటూ వుంటారు. అర్ధాకలితో వుండే పిల్లలు ఎక్కువ. ఇంట్లో కరెంట్ లేనివాళ్ళు ఎక్కువ. శుభ్రమైన తాగునీరు గ్రామాల్లో దొరకటం లేదు. ఆడపిల్లలైతే 7,8,9,10 తరగతుల పిల్లలను పరిశీలించినపుడు రక్తలేమి వారిని బాధిస్తుంది. కళ్ళు పీక్కు పోయి ఎముకలు గిడసబారి నీరసంగా ఉండే పిల్లలు ఎక్కువ. ఈ నేపథ్యంలో ఎక్కువగా డ్రాప్ అవుట్ అవుతున్నారు.

వందలో 80 కార్పొరేట్ కాలేజీలు అగ్ర కులాల వారే నడిపిస్తున్నారు. ఇక్కడ చదివేవారిలో పేదపిల్లలు చాలా తక్కువ. అదికూడా వారు అప్పులు చేసి చదువుతున్నారు. రెండు రాష్ట్రాల్లో యస్.టి.ల పరిస్థితి దారుణంగా వుంది. కార్పొరేట్ సంస్థలకు భూములను అమ్మివేస్తూ ఎస్టీలను వారి ఆవాసాల నుండి తరిమివేస్తున్నారు. కనీసం కాలువ గట్టుల మీద కూడా జీవించనీయకుండా, అలా జీవించే వారిని కూడా బుల్డోజర్‌లు పెట్టి రాత్రికి రాత్రి తరిమివేస్తున్నారు. రాష్ట్రంలో ఎస్టీల విద్య తీవ్ర సంక్షోభంలో వుంది. వీరిలో మొత్తంగా అక్షరాస్యతా శాతం 17.16 అయితే, అందులో పురుషులు 25.25 శాతం మంది, స్త్రీలు 8.68 శాతం మాత్రమే. వీరిలో 61.05 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువగా ఉన్నారు. పసిపిల్లలు వెయ్యికి 30మంది చనిపోతున్నారు. గర్భవతులు 1000కి 8 మంది చనిపోతున్నారు. ఒకటవ తరగతి నుండి 5వ తరగతి లోపు 74.26 శాతం మంది స్కూలు మానేస్తున్నారు. ఒకటవ తరగతి నుండి 7వ తరగతి మధ్యలో 82.30 శాతం మంది స్కూలు మానేస్తున్నారు. ఇంతవరకు ఎస్టీలకు 100కు 66 గ్రామాలకు కరెంటు లేదు. లక్ష మందిలో 47 మంది మాత్రమే మంచం మీద నిద్రిస్తున్నారు. 100కిలో మీటర్ల పరిధిలో 1.65 కి.మీటర్లకు మాత్రమే వారు విస్తరించారు. వీరికి 65 మాత్రమే రెసిడెన్షియల్ స్కూళు ఉన్నాయి. ఆశ్రమ పాఠశాలలు 507, హాస్టళ్లు 505, ఏకోపాధ్యాయ పాఠశాలలు 4,957 మాత్రమే ఉన్నాయి.

ఊళ్ళో బళ్ళు ఎత్తేసి మద్యం బెల్టు షాపులు పెట్టి మద్యం బానిసలుగా పురుషులను మారుస్తున్నారు. మహిళల మనోవేదన గ్రామాల్లో చెప్పరానిదిగా వుంది. మద్యం ఏరులై పారే గ్రామాల్లో విద్యను పూర్తిగా తుడిచివేసి ప్రైవేటు, కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్నారు. భారత రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లో అడుగంటిపోతున్న ప్రభుత్వ విద్యావకాశాల కోసం ...ప్రజలు విజ్ఞతతో సామాజిక విద్య విప్లవ పోరాటాలకు అండగా నిలవాలి. పాలకవర్గం ముమ్మరంగా కోట్లు ఖర్చుపెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రకటనలు చేస్తూ వుంటుంది. ఆ మాయలో పడకుండా వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకికవాద ఉద్యమాలకు అండగా నిలవాలి. ప్రభుత్వం కళ్ళు తెరిపించి ప్రభుత్వ బడుల్లో పిల్లలను విరివిగా చేర్పించి రాజ్యాంగం ఇచ్చిన విద్యా హక్కును ప్రజలే రక్షించుకోవలసి వుంటుంది. ప్రజలే చరిత్ర నిర్మాతలు. విద్యేయే విజ్ఞానానికి పునాది.

/ వ్యాసకర్త సెల్: 9849741695 /

జనవాక్యం

మితిమీరిన వీధి కుక్కల దాడులు!

ఇటీవల వెలువడిన ఒక సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సంభవించే రేబిస్ మరణాల్లో 36 శాతం మన దేశం నుంచే ఉంటుండటం ఆలోచించాల్సిన విషయం. అంతేకాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఈ వీధికుక్కల కాటు వల్ల ఏటా 18 వేల నుంచి 20 వేల మరణాలు సంభవిస్తుండటం, 30 నుంచి 60 శాతం మృతుల్లో అభం శుభం తెలియని చిన్నారులు ఎక్కువగా ఉంటుండటం మానవత్వం వున్న ప్రతి ఒక్కరి హృదయాలను తీవ్రంగా కలిచివేసే విషయం. అదేవిధంగా యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్-2001 ప్రకారం ఈ వీధి కుక్కల జనాభాను తగ్గించడానికి వాటికి స్టెరిలైజేషన్ టీకాలు వేయాల్సి ఉంటుంది. అయితే చాలా రాష్ట్రాల్లో నిధుల కొరతతో వీటికి టీకాలు వేయడంలో విఫలం అవుతుండటం ప్రజల పాలిట శాపంగా మారి, ఈ వీధి కుక్కల దాడులు వల్ల ప్రజల అమూల్యమైన ప్రాణాలకు ఏ మాత్రం గ్యారంటీ లేకుండా పోతోంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఈ వీధి కుక్కల కాటు నుంచి దేశ ప్రజానీకానికి విముక్తి కలిగించాలంటే తక్షణమే మన కేంద్ర ప్రభుత్వం వారు యుద్ధ ప్రాతిపదికన కదలాలి. సంబంధిత శాఖ వారికి ఈ వీధి కుక్కల దాడులను అరికట్టే చర్యలకు పూనుకునేలా సిఫారసు చేయాలి. లేకపోతే ప్రతి ఏడాది వేలాది మంది విలువైన ప్రాణాలు ఈ వీధికుక్కల కాటు వల్ల అనంత వాయువుల్లో కలిసిపోతాయి. వీధి కుక్కల దాడుల విషయంలో తస్మాత్ జాగ్రత్త!

- బుగ్గన మధుసూదనరెడ్డి, బేతంచెర్ల, నంద్యాల జిల్లా.

మిగులు టీచర్ల సంగతి...!

రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖ కొత్తగా క్లస్టర్ అకడమిక్ టీచర్ల విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. బదిలీల అనంతరం మిగులుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలను క్లస్టర్ అకడమిక్ టీచర్లుగా గుర్తించి, వారిని కస్టర్లకు కేటాయించి, ఆ క్లస్టర్ పరిధిలోని పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్లు సెలవు పెడితే వీరి సేవలను వినియోగించుకోనున్నట్లు తెలుపుతోంది. తెలంగాణలో ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లను కేటాయిస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం ప్రాథమిక పాఠశాలల నందు బేసిక్ ప్రైమరీల్లో 20 వరకు ఒక టీచర్, ఫౌండేషన్ స్కూళ్లలో 30 వరకు ఒక టీచర్ మాత్రమే కేటాయిస్తున్నారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో బోధన కష్టతరంగా ఉంటున్నది. ఇటువంటి పరిస్థితుల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా చేయాల్సిన ప్రభుత్వం మిగిలిన టీచర్లను క్లస్టర్ అకడమిక్ టీచర్లుగా మార్చి వారిని ఉపయోగించుకొంటామని చెప్పడం ఎంత వరకు సమంజసం? మిగిలిన ఎస్జీటీ టీచర్లను బేసిక్ ప్రైమరీల్లో, ఫౌండేషన్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా రెండో టీచరుగా కేటాయించాలి. అపుడే విద్యార్థులకు మెరుగైన గుణాత్మక విద్య ఇవ్వగలం.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

జ్యుడీషియల్ విచారణ చేయాలి : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

సింహాచలం దేవస్థానంలో చందనోత్సవం రోజున గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని, వెంటనే సింహాచలం దేవస్థానాన్ని శుద్ధిచేసి సంప్రోక్షణ చేయాలని వైసిపి మాజీ మంత్రి, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. విశాఖ బీచ్ రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి యేటా చందనోత్సవానికి లక్షల మంది యాత్రికులు వస్తారని తెలిసినా జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖ, ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఈ మరణాలను రాజకీయ హత్యలుగా పరిగణిస్తున్నామన్నారు. ఐదుగురు మంత్రుల బృందం సింహాచలం కొండపై సమావేశం నిర్వహించి ఆర్భాటాల కోసం చర్చించారే తప్ప.. చందనోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించలేదని, దీనికి మంత్రుల బృందం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనపై ప్రభుత్వంలో పనిచేస్తున్న అధికారులతో కమిటీ వేసి చేతులు దులుపుకుందని, వారు నిష్పక్షపాతంగా విచారణ ఎలా చేస్తారని బొత్స ప్రశ్నించారు. ఇంత ఘోర దుర్ఘటన జరిగినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇక్కడకు రాలేదని, ఎక్కడికి వెళ్లారో తెలియడం లేదని బొత్స అన్నారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖకు అసలు కమిషనర్ ఉన్నారా? అని ఆయన ప్రశ్నించారు. భారీ వర్షం మూలంగా గోడ కూలిపోయిందని ముఖ్యమంత్రి ప్రకటించారని, కేవలం తప్పించుకునేందుకే వర్షం సాకు చూపిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు హయాంలో ఇటువంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు. గురువారం ఉదయం బొత్స సహా పలువురు వైసిపి నేతలు సింహాచలంలో ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

కులగణను వైసిపి స్వాగతిస్తోంది

- వైసిపి నేత పోతిన మహేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కులగణనను వైసిపి స్వాగతిస్తోందని, జనగణనతోపాటే కులగణన జరిగితే అట్టడుగు వర్గాలకు మేలు జరుగుతుందని వైసిపి నేత పోతిన మహేష్ అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో తొలిసారి కులగణన చేసింది వైసిపి ప్రభుత్వమేనని చెప్పారు. ఆ నివేదికను టిడిపి కూటమి ప్రభుత్వం బయటకు రానీయడం లేదని, తక్షణం దానిని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కులాల వారీగా జనగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వైసిపి స్వాగతిస్తోందని పేర్కొన్నారు. 1931లో ఒకసారి కులగణన జరిగిందని, తరువాత చేయలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి పేదల పట్ల ప్రేమలేదని, అందువల్లే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు.

కళ్లు చెదిరే జిఎస్‌టి వసూళ్లు

న్యూఢిల్లీ : దేశంలో రికార్డ్ స్థాయిలో అమాంతం పెరిగిన పన్ను వసూళ్లు ప్రభుత్వ ఖజానాను నింపివేస్తున్నాయి. ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుత ఏడాది ఏప్రిల్‌లో వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లు రూ.2.37 లక్షల కోట్ల మార్క్‌ను చేరినట్లు గురువారం కేంద్ర ప్రభుత్వం గణంకాలను వెల్లడించింది. గతేడాది ఇదే నెల వసూళ్లతో పోల్చితే 12.6 శాతం పెరుగుదల నమోదయ్యిందని తెలిపింది. దీంతో ప్రజలపై అమలు చేస్తోన్న హెచ్చు పన్నులు సర్కార్ ఖజానాను గలగలలాడేలా చేస్తోన్నాయని స్పష్టమవుతోంది. 2024 ఇదే ఏప్రిల్‌లో రూ.2.10 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లయ్యింది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం కాగా.. తాజాగా ఆ రికార్డు ఈ ఏడాది తుడుచుకుపెట్టుకుపోయింది.

తెలుగు రాష్ట్రాల్లో...

ఏప్రిల్ 2025లో తెలుగు రాష్ట్రాల్లో మిశ్రమ పన్ను వసూళ్లు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో తగ్గగా.. తెలంగాణలో జిఎస్‌టి రాబడి పెరిగింది. తెలంగాణలో 12 శాతం వృద్ధితో రూ.6,983 కోట్ల జిఎస్‌టి వసూళ్లు జరిగాయి. గతేడాది ఇదే ఏప్రిల్‌లో రూ.6,236 కోట్లుగా నమోదయ్యాయి. కాగా.. గడిచిన నెలలో ఆంధ్రప్రదేశ్‌లో జిఎస్‌టి వసూళ్లు 3 శాతం తగ్గి రూ.4,686 కోట్లకు పరిమితమయ్యాయి. 2024 ఇదే నెలలో ఎపిలో రూ.4,850 కోట్ల జిఎస్‌టి వసూళ్లయ్యింది.

అమరావతికి మోడీ రెండోసారి

- హామీలపై సర్వత్రా చర్చ
- మాటల్లోనే ప్రపంచ స్థాయి రాజధాని
- 10 ఏళ్లుగా కొలిక్కిరాని నిర్మాణాలు

2015 అక్టోబరు 22న రాజధాని అమరావతి శంకుస్థాపన శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మోడీ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం వద్దకు రానున్నారు. మోడీ రాజధాని అమరావతికి రావడం ఇది రెండోసారి. 2015 అక్టోబరు 22న రాజధాని అమరావతి శంకుస్థాపన నిమిత్తం ఆయన తుళ్లూరు మండలం ఉద్దండ్రాయునిపాలెం వచ్చారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మట్టి, నీటిని అమరావతికి తీసుకువచ్చి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని అనేక అంశాలు కాగితాలకే పరిమితం అయ్యాయి. ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మిస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. 2015 నుంచి 2019 మధ్య కాలంలో కేంద్రం నుంచి రాజధాని నిర్మాణానికి ఇచ్చింది కేవలం రూ.1500 కోట్లు మాత్రమే. ఈ నిధులతోనే ప్రపంచ స్థాయి నిర్మాణం జరుగుతుందా? అన్న చర్చ అప్పట్లో జరిగింది. 2018 వరకు ఎన్‌డిఎ కూటమిలో ఉన్న టిడిపి ఆ తర్వాత బయటకు రాగానే రాజధానికి నిధులను కేంద్రం పూర్తిగా ఎండగట్టింది. నరేంద్ర మోడీ నిధులు ఇవ్వకపోవడంపై టిడిపి పలుసార్లు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేసింది. తాము కేవలం భవనాల నిర్మాణం కోసం రూ.1,500 కోట్లు ఇచ్చామని, మిగతా పనులతో తమకు సంబంధం లేదని అప్పట్లో కేంద్ర మంత్రులు టిడిపి నాయకులపై ఎదురు దాడి చేశారు. విభజన చట్టంలోని కీలక అంశంగా ఉన్న ప్రత్యేక హోదాను కేంద్ర ప్రభుత్వం విస్మరించింది.

ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజి ఇస్తున్నట్టు ప్రకటించినా నిధులు రాష్ట్రానికి అంతగా రాలేదు. ప్రధానంగా రాజధాని నిర్మాణానికి కనీసం రూ.50 వేల కోట్లు అవసరం అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినా కేంద్రం స్పందించలేదు. 2019 నుంచి 2024 మధ్య వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసినా మోడీ ప్రభుత్వం ఏ మాత్రమూ అడ్డుకోలేదు. రాజధాని అంశం రాష్ట్రం పరిధిలోనిదని కేంద్ర ప్రభుత్వం డబుల్ గేమ్ ఆడింది. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసి బిజెపితో పొత్తు పెట్టుకోవడం, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, టిడిపి మద్దతుపైనే కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తు ఆధారపడి ఉండడంతో రాజధాని అమరావతికి మళ్లీ ఊపిరి వచ్చిందని టిడిపి కూటమి నేతల ప్రకటించారు. అయితే, ప్రపంచ బ్యాంకు నుంచి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు రుణం ఇప్పించేందుకు మాత్రమే కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మొగ్గుచూపింది. గ్రాంట్ రూపంలో అందించేందుకు ముందుకు రాలేదు. ఆ తర్వాత వివిధ ప్రాజెక్టులు, పథకాల ద్వారా దశల వారీగా నిధులు ఇస్తామంటూ హామీ ఇచ్చింది. ప్రస్తుతం రూ.43 వేల కోట్ల అంచనాలతో రాజధాని అమరావతిలో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఇప్పటికే పలు పనులకు టెండర్లు పిలిచింది. ఈ పనులను ప్రారంభించేందుకు ప్రదాని మోడీని ఆహ్వానించారు. తద్వారా కేంద్రం నుంచి మరిన్ని నిధులు రాబట్టుకోవాలని టిడిపి కూటమి ప్రభుత్వం ఆశిస్తోంది. గతంలో ఇచ్చిన ప్రపంచ స్థాయి రాజధాని హామీకి కట్టుబడి ప్రధాని మోడీ రాష్ట్ర ప్రజలకు ఎటువంటి హామీలు ఇస్తారనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. 2015లో ముంతడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చారన్న విమర్శలకు దీటుగా ఈసారి ప్రజల మేలు కోసం, అమరావతి నిర్మాణం కోసం ఎటువంటి హామీలు ఇస్తారు, కార్యాచరణ ఎలా ఉంటుందోనన్న చర్చ ప్రజల్లో జరుగుతోంది.

'జగన్ 2.0'లో కార్యకర్తలకు పెద్దపీట

- ప్రజాప్రతినిధుల సమావేశంలో జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ హయాంలో కార్యకర్తలకు అనుకున్న మేర చేయలేకపోయామని, జగన్ 2.0లో అందరికీ పెద్దపీట వేస్తామని మాజీ సిఎం, వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో గురువారం తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన సమావేశమైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి పాలనలో విచ్చలవిడిగా స్కాములు జరుగుతున్నాయన్నారు. ఇసుక, మట్టి, మద్యం ప్రతిదీ మాఫియాగా నడుస్తోందని విమర్శించారు. ఊర్లలో ఎక్కడ చూసినా బెల్టు షాపులే దర్శనమిస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ దోపిడీ చేస్తున్నారని, రాష్ట్రమంతా దోచుకో, పంచుకో తినుకో పద్ధతి నడుస్తోందని అన్నారు. రూపాయికి ఇడ్లీ రాకపోయినా ఎకరం భూమి మాత్రం ఇస్తున్నారని విమర్శించారు. ఊరుపేరులేని కంపెనీలకు భూములు దారధత్తం చేస్తున్నారని, మొబిలైజేషన్ అడ్వాన్సులు పేరిట దోచుకుంటున్నారని చెప్పారు. చంద్రబాబుకు ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెబుతారని అన్నారు. ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు చూపించిన తెగువ అమోఘమని, నిబద్ధతతో నిలబడ్డారని పేర్కొన్నారు. విశ్వసనీయ రాజకీయాలు అంటే వైసిపి ప్రజాప్రతినిధులను చూసి చంద్రబాబు నేర్చుకోవాలన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఓడినా ప్రజల గుండెల్లో ఉన్నామని అన్నారు. వైసిసి కార్యకర్తలు ప్రజల వద్దకు కాలర్ ఎగరేసుకుని వెళ్లగలరని, టిడిపి శ్రేణులు వెళ్లే పరిస్థితి లేదని చెప్పారు.

తప్పని డోలీ కష్టాలు

- మార్గ మధ్యలో గిరిజన గర్భిణి ప్రసవం

గర్భిణీని డోలీలో తీసుకొస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)

గిరిశిఖర గ్రామాల గిరిజనులకు డోలీ మోత కష్టాలు తప్పడం లేదు. డోలీతో తీసుకొస్తుండగా మార్గం మధ్యలో ఓ గర్భిణి ప్రసవించింది. ఈ సంఘటన విజయనగరం జిల్లా శృంగవరపుకోట కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. గిరిజనులు తెలిపిన వివరాల మేరకు... శృంగవరపుకోట పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామమైన రేగపుణ్యగిరికి చెందిన పాంగి సీతమ్మ గర్భిణిగా ఉన్నారు. గురువారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో ఆమె భర్త నర్సింగరావు తోటి గిరిజనుల సాయంతో డోలీ కట్టి కొండ దిగువ ప్రాంతానికి తీసుకొస్తున్నారు. మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువయ్యి అక్కడే సీతమ్మ ప్రసవించారు. అనంతరం తల్లి, బిడ్డను డోలీపై కొండ కిందికి తీసుకొచ్చి, అక్కడి నుంచి 108 వాహనంలో పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

దిగివస్తోన్న బంగారం ధర

- మరో రూ.2160 తగ్గుదల

న్యూఢిల్లీ : నింగికంటిన బంగారం ధరలు క్రమంగా దిగివస్తోన్నాయి. అమెరికా, చైనా మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం సహా రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగియనుందనే అంచనాలు పసిడి తగ్గుదలకు దోహదం చేస్తోన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,160 తగ్గి రూ.95,880కి దిగివచ్చింది. గుడ్‌రిటర్న్ సమాచారం ప్రకారం.. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,000 దిగివచ్చి రూ.87,900గా పలికింది. 10 రోజుల్లో పసిడి ధర దాదాపు రూ.5వేల మేర తగ్గింది. ఇటీవల తులం బంగారం ధర రూ.1 లక్ష దాటిన విషయం తెలిసిందే. కిలో వెండిపై రూ.2,000 తగ్గి రూ.98,000గా నమోదయ్యింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం ధర దిగివస్తోంది. ఔన్సు ధర 3,236.94 డాలర్ల వద్ద నమోదయ్యింది. ఆల్‌టైం గరిష్ట స్థాయి 3,500 డాలర్ల నుంచి నుంచి 7 శాతం మేర తగ్గి 3,232 వద్ద పలికింది. ప్రపంచ మార్కెట్‌లో గడిచిన ఏడాది కాలంలో బంగారం ధర దాదాపు 40 శాతం పెరిగింది. అంతర్జాతీయ పరిణామాలకు తోడు డాలర్ విలువ బలపడుతుండటం కూడా పసిడి ధర తగ్గడానికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున కొనుగోళ్లు తదితర అంశాలు బంగారం ధరలకు ఆజ్యం పోశాయి. నింగికంటిన బంగారం ధరల వల్ల ఈ ఏడాది జనవరి మార్చి త్రైమాసికంలో భారత్‌లో పసిడి డిమాండ్ 15 శాతం తగ్గిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) బుధవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. ఆ మూడు నెలల కాలంలో బంగారం అమ్మకాలు 118.1 టన్నులకు పడిపోయాయి. పెట్టుబడుల డిమాండ్ మాత్రం 7 శాతం పెరిగి 46.7 టన్నులుగా చోటు చేసుకుంది. ఇదే సమయంలో అభరణాల డిమాండ్ ఏకంగా 25 శాతం క్షీణించి 71.4 మెట్రిక్ టన్నులకు క్షీణించింది. 2009 తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి కావడం విశేషం.

గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శితో చర్చలు విఫలం

- స్పెషల్ డిఎస్‌సి కోసం నేడు మన్యం బంద్

ప్రజాశక్తి - రంపచోడవరం (అల్లూరి జిల్లా)

ఆదివాసీలకు ఏజెన్సీలో శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని, ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం.నాయక్‌కు ఆదివాసీ సంఘాల నాయకులు అల్లూరి జిల్లా రంపచోడవరంలో గురువారం వినతిపత్రం అందజేశారు. పలు విషయాలపై చర్చలు జరిపారు. అవి సఫలం కాకపోవడంతో ముందు ప్రకటించినట్టుగానే ఈ నెల 2న మన్యం బంద్ జరిగి తీరుతుందని నాయకులు స్పష్టం చేశారు. రంపచోడవరం డివిజన్‌కు పర్యటన నిమిత్తం వచ్చిన నాయక్‌ను ఐటిడిఎ కార్యాలయంలో ఆదివాసీ సంఘాల నాయకులు కలిశారు. తక్షణమే ఏజెన్సీ ప్రాంతాన్ని మెగా డిఎస్‌సి నుంచి మినహాయించాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ చేయాలని కోరారు. సుమారు గంటపాటు చర్చలు జరిగాయి. సమస్యను ప్రభుత్వం దృష్టిలో పెడతానని నాయక్ అన్నారు. తాజా డిమాండ్లపై స్పష్టంగా ఏమీ హామీ ఇవ్వలేదు. దీంతో శుక్రవారం ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి పోరాట కమిటీ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యాన మన్యం బంద్ జరుగుతుందని నాయకులు తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అధ్యక్షులు లోతా రామారావు, నాయకులు పి.అప్పలనర్స, దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.మాణిక్యం, గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సత్యనారాయణ తదితరులు నాయక్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. తాజా మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఆదివాసీ ప్రాంతంలో పేర్కొన్న మొత్తం 766 పోస్టుల్లో ఆదివాసీలకు దక్కేవి కేవలం 42 మాత్రమే ఉన్నాయని తెలిపారు. బంద్ జయప్రదానికి అందరూ సహకరించాలని కోరారు.

కాంతిరాణా, విశాల్ గున్నీ పిటిషన్ విచారణ వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

సినీనటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు పెట్టిన కేసును కొట్టయాలని అభ్యర్థిస్తూ ఐపిఎస్ అధికారులు కాంతిరాణ టాటా, విశాల్ గున్నీ, పోలీసు అధికారులు హనుమంతరావు, సత్యనారాయణ, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్ల విచారణను హైకోర్టు ఈ నెల 8కి వాయిదా వేసింది. జత్వానీ కేసులో వీరిని విచారణకు పిలవబోమని, చార్జిషీట్ దాఖలు చేయబోమని గతంలో అడ్వొకేట్ జనరల్ ఇచ్చిన హామీని అప్పటి వరకు పొడిగించింది. ఈ మేరకు జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ఆదేశాలను జారీ చేశారు. సీనియర్ న్యాయవాదులు వినోద్ కుమార్ దేశ్పాండే, శ్రీరామ్, వేములపాటి పట్టాభి వాదిస్తూ. మరో కేసులో విచారణకు హాజరు కావాలంటూ పిటిషనర్లకు పోలీసులు నోటీసులు ఇచ్చినట్లు పత్రికల్లో కథనాలు వచ్చాయన్నారు. పోలీసుల తరపున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతి వాదన చేస్తూ, జత్వానీ కేసులో పిటిషనర్లకు నోటీసులు ఇవ్వలేదన్నారు. మరో కేసులో నోటీసు లకు ఈ కేసుకు సంబంధం లేదని చెప్పారు. తదుపరి విచారణ వేసవి సెలవుల తర్వాత చేప డతామని హైకోర్టు చెప్పడంపై ఏజీ కల్పించుకుని గురువారానికి విచారణ వాయిదా వేయాలని కోరారు. దీంతో, హైకోర్టు అనుమతించింది.

మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి బెయిల్ పిటిషన్ వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

శ్రీసత్యసాయి జిల్లా రామగిరి పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ వైసిపి నాయకులు , రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోదుపర్తి ప్రకాశ్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ సోమవారానికి వాయిదా పడింది . కేసులో పూర్తి వివరాలు అందజేయాలని పోలీసులను జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా, పాపిరెడ్డిపల్లిలో హెలిప్యాడ్ వద్ద జరిగిన ఘటనలపై కానిస్టేబుల్ నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ప్రకాశ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. న్యాయవాది మరక్కగారి బాలకృష్ణ వాదిస్తూ ప్రకాశ్‌రెడ్డిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇప్పటికే ప్రకాశ్ రెడ్డి ఇంట్లో సోదాలు కూడా చేశారన్నారు. ఇదే కేసులో మిగిలిన నిందితులకు హైకోర్టు సానుకూల ఉత్తర్వులు ఇచ్చింది తెలిపారు

వడదెబ్బతో ఉపాధి కార్మికురాలు మృతి

ప్రజాశక్తి - వరదయ్యపాలెం (తిరుపతి)

ముదులమ్మ

వడదెబ్బతో ఉపాధి హామీ కార్మికులు మృతి చెందిన సంఘటన తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచరపాలెం గ్రామానికి చెందిన ముదులమ్మ (64) ఉపాధి పనులకు వెళ్లారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో పని ప్రదేశంలో అస్వస్థతకు గురయ్యారు. తోటి కార్మికులు ఆమెను శ్రీకాళహస్తిలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఫిరంగిపురం బ్రాంచ్ (21345) ఫిరంగిపురం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522529

డిమాండ్ నోటీసు
సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు

(I) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: శ్రీమతి దాసరి షోరమ్మ, భర్త : శ్రీ యరమల ఆనంద రాజు, డోర్ నెం.1-131, శాంతిపేట, 1వ వార్డు, నవ భారత్ రెసిడెన్సీ దగ్గర, ఫిరంగిపురం (గ్రామం & మండలం), గుంటూరు జిల్లా.
HTL A/c No.39800060777 & Xpress Credit A/c No.38689270733.
(II) బకాయి మొత్తం: తేది.07.04.2025 నాటికి మొత్తం రూ.12,16,313/- (అక్షరాల పన్నెండు లక్షల పదహారు వేల మూడు వందల పదమూడు రూపాయలు మాత్రమే) + పైన పేర్కొన్న మొత్తానికి కాంట్రాక్టువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీతో కలిపి ఇతర ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు, మొ॥వితో కలిపి చెల్లించవలెను. (తదుపరి చెల్లింపులు ఏమైనా ఉన్నచో తీసివేయబడి)
(III) డిమాండ్ నోటీసు తేది: 07.04.2025 NPA తేది: 01.04.2025

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు:
గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, ఫిరంగిపురం సబ్-జిల్లా, శాంతిపేట, ఫిరంగిపురం గ్రామం & మండలం, డి.నెం.45/ఎ2, పెట్రోల్ బంక్ మరియు హీరో హోండా షోరూమ్ దగ్గర, డోర్ నెం.131 నందు విస్తీర్ణం 242 చ॥గ॥లు లేదా 202.336 చ॥మీ॥లు స్థలంతో పాటు నివాసయోగ్యమైన ఇల్లు నిర్మాణంతో కలదు. రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ దస్తావేజు నెం.29/2005, తేది.1101.2005 ప్రకారం శ్రీమతి దాసరి షోరమ్మ, భర్త : ఆనంద రాజు గారికి చెందిన ఆస్తి. హద్దులు : తూర్పు : ముద్దర్సి చంద్రపు రాజు గారికి చెందిన స్థలం, దక్షిణం : నూతలపాటి రాములు గారికి చెందిన స్థలం, పడమర : పంచాయితీ బజార్, ఉత్తరం : ముద్దర్సి చంద్రపు రాజు గారికి చెందిన స్థలం.

పైన చెప్పబడిన ఋణగ్రహీత/హామీదారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫిరంగిపురం బ్రాంచ్, ఫిరంగిపురం, గుంటూరు జిల్లా & సత్తెనపల్లి బ్రాంచ్, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా వారి నుండి ఋణము పొందియున్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని హామీగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ నిబంధనలననుసరించి సకాలంలో చెల్లించకపోవటచే సదరు (Xpress Credit A/c No.38689270733) ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమ నిబంధనల ప్రకారం నిరర్థక ఖాతాగా పరిగణించబడినది. బ్యాంకువారు రిజిష్టర్ పోస్టు ద్వారా పంపించిన డిమాండ్ నోటీసులు తిరిగి వచ్చినందున, ఋణగ్రహీత/హామీదారుల సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరల నోటీసు జారీచేయడమగుచున్నది. కావున మీరు పైన పేర్కొన్న మొత్తములను ఈ పత్రికా ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా వడ్డీ & ఇతర ఖర్చులతో కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది: 07.04.2025, ప్రదేశం: ఫిరంగిపురం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్వాధీన నోటీసు
(స్థిరాస్తి కోసం)

పేర్కొనడంఏమనగా,

దిగువ సంతకం చేసిన వారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఇన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 కింద **సమ్మాన్ క్యాపిటల్ లిమిటెడ్ (CIN:L65922DL2005PLC136029)** (గతంలో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ అని పిలిచేవారు) యొక్క అధికృత అధికారి మరియు సెక్యూరిటీస్ ఇంట్రెస్ట్ (ఇన్ఫోర్స్‌మెంట్) నిబంధన, 2002 యొక్క నిబంధన 3 లోని సెక్షన్ 13 (12) కింద హక్కులను వినియోగించుకుంటూ, లోన్ అకౌంట్ నం **HLAPHYD00314247** లో తేదీ **23.01.2025** నాటికి నోటీసులో పేర్కొన్న రూ. **2,65,78,283.63 (రెండు కోట్ల అరవై ఐదు లక్షల డెబ్బై ఎనిమిది వేల రెండు వందల ఎనభై మూడు రూపాయల అరవై మూడు పైసలు మాత్రమే)** అసలు మొత్తాన్ని దానిపై అయ్యే వడ్డీతో సహా, ఈ నోటీసు అందిన తేదీ నుంచి 60 రోజులలోపున తిరిగి చెల్లించవలసిందిగా ఋణం తీసుకున్న వారైన **విజయ రంతం వర్చూరి అలియాస్ వరుచూరి విజయ రత్నం, మెక్వెల్ కన్స్ట్రక్షన్స్ (దాని భాగస్వాముల ద్వారా) మరియు ప్రసాద్ రావు వర్చూరి** లను కోరుతూ తేదీ **24.01.2025** నాడు డిమాండ్ నోటీసు జారీ చేయడం జరిగింది.

రుణగ్రహీత (లు) మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనందున, దిగువ సంతకం చేసిన వ్యక్తి సబ్ కింద అతనికి అందించబడిన అధికారాలను ఉపయోగించడం ద్వారా దిగువ వివరించిన ఆస్తిని **ఆస్తిని స్వాధీనం** చేసుకున్నట్లు రుణగ్రహీత (లు) మరియు సాధారణ ప్రజలకు దీని ద్వారా నోటీసు ఇవ్వబడింది. చట్టంలోని సెక్షన్ 13(4) **26.04.2025** నాటి భద్రతా ఆసక్తి (అమలు) రూల్స్, 2002లోని 8వ నిబంధనతో చదవబడింది.

ప్రత్యేకించి ఋణం తీసుకున్న వారికి మరియు సాధారణ ప్రజానీకానికి ఈ ఆస్తి విషయంలో వ్యవహారాలు కొనసాగించవద్దని హెచ్చరించడమైనది మరియు దీని విషయంలో ఏవైనా లావాదేవీలు జరిపితే తేదీ **23.01.2025** నాటికి **సమ్మాన్ క్యాపిటల్ లిమిటెడ్ (గతంలో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ అని పిలిచేవారు)** కి **రూ. 2,65,78,283.63 (రెండు కోట్ల అరవై ఐదు లక్షల డెబ్బై ఎనిమిది వేల రెండు వందల ఎనభై మూడు రూపాయల అరవై మూడు పైసలు మాత్రమే)** మొత్తాన్ని మరియు దీనిపై అయ్యే వడ్డీతో సహా చెల్లించవలసి ఉంటుంది.

సెక్యూర్డ్ ఆస్తులని రిడీమ్ చేసుకునేందుకు లభించే సమయానికి చట్టంలోని సెక్షన్ 13 కోని ఉప-సెక్షన్ (8) నిబంధనలపై దృష్టి పెట్టవలసిందిగా రుణ గ్రహీతను ఆహ్వానించడం జరుగుతోంది.

స్థిరాస్తి వివరాలు

ఆ మొత్తం 641.3 చదరపు గజాల విస్తీర్ణం లేదా 536.21 చదరపు మీటర్ల స్థలం, దానితో పాటు భవన నిర్మాణ భవనం, దాని తరువాత బేరింగ్ డోర్ నెం. 54-14-21, గుణదల మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో, ఆర్.ఎస్. నెం. 392/1బి, 392/1, కృష్ణ జిల్లా. విజయవాడ - 520008, ఆంధ్రప్రదేశ్లో ఉంది మరియు దీని కింద సరిహద్దుగా ఉంది

తూర్పు : స్టేట్ బ్యాంక్ కాలనీ పశ్చిమం : బి. దుర్గారావు ఆస్తి
ఉత్తరం : వి. మధుసూధనరావు ఆస్తి దక్షిణం : వి. రామకృష్ణరావు ఆస్తి

అధికృత అధికారి
తేదీ : 26.04.2025 సమ్మాన్ క్యాపిటల్ లిమిటెడ్
స్థలం : విజయవాడ (గతంలో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ అని పిలిచేవారు)

ప్రకాశం జిల్లా రాజ పత్రము
పార్ట్- 1 ఎక్స్ట్రార్డినరీ
అధికారిక ప్రచురణ

నెం.9 ఒంగోలు తేది: 30-04-2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్, ప్రకాశం జిల్లా, ఒంగోలు

ఆర్.సి.ఎల్.ఎ5(జి3)/1703/2015, ఫారం నెం.VII ది: 30-04-2025

(2013 వ సంవత్సరము 30 వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునః స్తాపనలలో న్యాయ పరమైన నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19 (1) మరియు ఆంధ్ర ప్రదేశ్ నియమావలి 2014 లో రూల్ - 25 సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢి ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్డు నిర్ధారించిన భూములకు మరియు వారి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనములకై అనగా పామూరు నుంచి ఇరువురుకు పోవు రోడ్డు నిర్మాణం జరిగి వున్నదని శ్రీ జిల్లా కలెక్టర్, ప్రకాశం జిల్లా, ఒంగోలు వారు భావించినందున 2013 వ సంవత్సరము 30వ చట్టం లోని 15 విభాగమును అనుసరించి సంభందిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరముల పై విచారణ జరిపిన పిమ్మట జిల్లా కలెక్టర్, ప్రకాశం జిల్లా, ఒంగోలు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తము భూ సేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూ సేకరణ కోరిన సంస్త అవసరమగు బడ్జెట్ నిధులను సమకూర్చినారు. ఈ దిగువ రూఢి ప్రకటన 2013 వత్సరపు 30 వ చట్టములోని 19(1) విభాగమును అనుసరించి చేయబడినది.

రూఢి ప్రకటన

శ్రీ జిల్లా కలెక్టర్, ప్రకాశము జిల్లా, ఒంగోలు వారు 2013 సంవత్సరము 30 వ చట్టములోని 19 (1) విభాగమును అనుసరించి ఈ దిగువ నుదాహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు షుమారుగా వాటి విస్తీర్ణములను య 0.42 సెంట్లు ప్రజా ప్రయోజనములకై అనగా పామూరు నుంచి ఇరువురు కు పోవు రోడ్డు నిర్మాణం జరిగి యుండు నిమిత్తము అవసరమైవున్నదని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : ప్రకాశం మండలము : పామూరు గ్రామము : పామూరు

వరుస సంఖ్య	సర్వే నెం	భూమి స్థితి	మొత్తం విస్తీర్ణం ఎ.సెంట్లు	సేకరించిన విస్తీర్ణం ఎ.సెంట్లు	సంబంధించిన ఆసామి పేరు మరియు చిరునామ పట్టాదారు మరియు అనుభదారు	హద్దులు ఉత్తరం	హద్దులు దక్షిణం	హద్దులు తూర్పు	హద్దులు పడమర	చెట్లు మరియు కట్టడములు వివరములు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	229-8	పట్టా	0.68	0.42	షేక్ హాజీ గౌస్ (రిట్ పిటిషనర్)	207	229-9	318	229-2,3,4,5	-

శ్రీయుత రెవెన్యూ డివిజనల్ అధికారి, కనిగిరి వారి కార్యాలయమునందు ఉంచడమైనది. దానిని కార్యాలయపు పని వేళలలో ఏ సమయంలోనైనను తనిఖీ చేసుకొనవచ్చును.
ఈ భూసేకరణ వలన నిర్వాసితులు అయిన వారు ఏవరు లేరు.

బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూములలో గాని, లేదా ఒక ప్రత్యేక భాగంలో గాని వుంటే, అటువంటి భూములలో చెరువు మరియు కాలువ నిర్మాణంనకు అవసరం అయిన భూభాగంలను మాత్రమే త్రవ్వటగాని, తొలగించుటగాని చేయవలెను.

సం॥ **ఎ.తమీమ్ అన్సారియా,** కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్, ప్రకాశం జిల్లా, ఒంగోలు.



బొమ్మలు వేస్తా.. డ్యాన్స్ చేస్తా ...

హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు ఈశ్వరి సిద్ధి. 7వ తరగతి చదువుతున్నాను. నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. అలాగే బొమ్మలు వేయడం, తయారు చేయడం కూడా బాగావచ్చు. ఈ బొమ్మలన్నీ నేను తయారుచేసినవే. కావాల్సిన ముడి సరుకు నేనే స్వయంగా సిద్ధం చేసుకున్నాను. బ్లూ, పర్పుల్, వైలెట్ రంగుల క్లేలు కలిపితే డార్క్ బ్లూ కలర్ వచ్చింది. ఆ క్లేని కృష్ణ బొమ్మను తయారు చేయడానికి ఉపయోగించాను. అలాగే డార్క్ ఆరెంజ్ కలర్ రావడానికి ఎల్లో, ఆరెంజ్, రెడ్ క్లే కలిపాను. ఇంకా జుట్టు రంగుకి తెలుపు, నలుపు కలర్ క్లే కలిపాను. గ్రే కలర్ వచ్చింది. దీంతో బొమ్మ బాగా వచ్చింది.



చిత్రలేఖనం, బొమ్మలు తయారుచేయడం, బొమ్మలకు పాలిథిన్ కవర్లతో డ్రెస్సెస్ తయారు చేయడం, భక్తి పాటలకు డ్యాన్స్ చేయడం, కూచిపూడి నృత్యం చేయడం నాకెంతో ఇష్టం. నా అభిరుచిని తెలుసుకుని మా అమ్మానాన్న, కుటుంబ సభ్యులు నన్నెంతో ప్రోత్సహిస్తున్నారు.

- ఈశ్వరి సిద్ధి,
7వ తరగతి, నారాయణ స్కూలు, నెల్లూరు,
కాళహస్తి మున్సిపాల్టీ, శ్రీకాళహస్తి.

మత్తులో జీవితాలు చిత్తు

ఒక ఊరిలో రామయ్య అనే రైతు ఉన్నాడు. అతనికి ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. రామయ్య వ్యవసాయ పనులు చేస్తూ మొదట్లో కుటుంబంతో కలిసి హాయిగా జీవనం సాగించేవాడు. ఒకసారి స్నేహితులతో బయటకు వెళ్ళాడు. వారు అతనికి గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు చేశారు. రామయ్య ఆ మత్తుకి పూర్తిగా అలవాటు పడ్డాడు. తండ్రిని చూసి చదువుకోవాల్సిన కొడుకు కూడా మత్తు పదార్థాలకు అలవాటు పడ్డాడు. నాన్నను, అన్నను చూసి చెల్లి రాధ చాలా బాధపడింది. ఎలాగైనా వాళ్ళ నాన్నను, అన్నను మార్చాలని అనుకుంది. చదువొక్కటే మార్గమని భావించింది.

రామయ్య భార్య కూలీకి వెళ్లి కూతురిని చదివించింది. రాధ బాగా చదివి కలెక్టర్ అయ్యింది. విధుల్లోకి చేరగానే మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారి పరిస్థితిని వివరిస్తూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ప్రజలు ఎంతలా బాధపడుతున్నారో వివరించింది. ఆ లేఖతో మత్తు పదార్థాల అమ్మకాలను నిషేధించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

రాధ అనుకున్నట్టుగానే వాళ్ళ నాన్న, అన్న మత్తు పదార్థాలు తీసుకోవడం మానేశారు. ఎప్పటిలాగే వ్యవసాయం చేస్తూ హాయిగా బతుకుతున్నారు. కలెక్టరుగా తన వారినే కాక, ఊరిని కూడా బాగుచేసినందుకు ప్రజలందరూ రాధని మెచ్చుకున్నారు. ఈసారి కలెక్టరు బాధ్యతగా ఇతర గ్రామాలలో మత్తు పదార్థాలకు బానిస అయిన వారిలో మార్పు తేవడం విధిగా పెట్టుకుంది. ఇప్పుడు తన గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు కూడా వారి వారి పనులు చేసుకుంటూ సంతోషంగా ఆరోగ్యంగా జీవిస్తున్నారు.

- ఎం.జ్యోత్స్న
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రేగులపల్లి గ్రామం,
బెజ్జంకి మండలం, సిద్ధిపేట జిల్లా,
96033 89441.

బొమ్మల కొలువు

- క్రిష్ అల్విన్,
8వ తరగతి,
రాయల్ పబ్లిక్ హైస్కూలు,
నులకపేట,
గుంటూరు జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

అదాని ప్రాజెక్టుతో
గొంతెండనున్న విశాఖ

- రైవాడ ఆయకట్టుకు ఎసరుతో తాగునీటికి కటకట
- గత ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేస్తున్న కూటమి సర్కారు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

అదానికి చెందిన రైవాడ ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు వల్ల అనకాపల్లి, విశాఖ జిల్లాల వారికి పలు రూపాల్లో ముప్పు తలెత్తనుంది. ఈ ప్రాజెక్టు పనులకు అవసరమైన 213.80 ఎకరాల భూ సేకరణకు విజయనగరం జిల్లా కలెక్టర్ అంబేద్కర్ ఈ నెల 23న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు వేపాడ మండలంలోని మారిక కొండ, అక్కడి గిరిజనుల జీవనాధార భూమిని అదానికి కట్టబెట్టాలని చూస్తున్నారు. దీనిని స్థానిక గిరిజనులు, గిరిజన సంఘాలు వ్యతిరేకిస్తున్నా అధికారులు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. విద్యుత్ డిమాండ్ సమయంలో నీటిని పంప్ చేసి విద్యుదుత్పత్తి జరిగేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. నీటి నిల్వ కోసం ఎగువన ఒక రిజర్వాయర్, దిగువన మరో రిజర్వాయర్ నిర్మించనున్నారు. ఈ రెండు రిజర్వాయర్లతో శారద నదిపై నిర్మించిన రైవాడ జలాశయానికి వచ్చే నీటి ప్రవాహం దాదాపు తగ్గిపోతుంది. అనంతగిరి, వేపాడ మండలాల నుంచి వచ్చే నీటి వాగులను పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల నిమిత్తం నిర్మించే రిజర్వాయర్లకు మళ్లిస్తారు. ఈ నీటి ప్రవాహం శారద నదిలోకి రాకపోతే, దీనిపై నిర్మించిన రైవాడ జలాశయానికి నీరు రాకుండాపోతుంది. దాదాపు నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన వారాడ నారాయణమూర్తి రైవాడ జలాశయం కింద దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం, వేపాడ మండలాల్లో 21,344 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. రైవాడ నీటిని విశాఖ నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ప్రతిరోజూ 15 ఎంజిడిలను విడుదల చేస్తున్నారు. దీంతో, ఆరు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని నిలిపివేశారు. విశాఖ నగర ప్రజలకు సంబంధించి దాదాపు 5.50 లక్షల మందికిపైగా తాగునీటి సౌకర్యం రైవాడ జలాశయం ద్వారా లభిస్తోంది. విద్యుదుత్పత్తి కోసం అదాని రిజర్వాయర్లకు ఈ నీటిని మళ్లిస్తే దీనికిందనున్న ఆయకట్టు, విశాఖ నగర ప్రజలకు తాగునీరు ప్రశ్నార్థం కానుంది.,

వైసిపి హయాంలో రూపకల్పన

వెయ్యి మెగావాట్ల సామర్థ్యం కలిగిన అదాని పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు వైసిపి ప్రభుత్వంలో రూపకల్పన జరిగింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీటివనరుల లభ్యతపై నివేదిక ఇవ్వాలని జలవనరుల శాఖాధికారులను అప్పట్లో ఆదేశించింది. జలాశయంపైన పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు నిర్మిస్తే దానికింద ఉన్న ఆయకట్టు దెబ్బతింటుందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ నివేదికను కాదని అధికారులపై ఒత్తిడి తెచ్చి నీటి లభ్యతపై అనుకూలంగా నివేదిక తయారు చేయించినట్లు అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. అదాని ప్రతినిధులు ఈ ప్రాజెక్టు నిర్మాణంపై సర్వే చేశారు. గత ప్రభుత్వంలో తయారు చేసిన నివేదిక ఆధారంగానే టిడిపి కూటమి ప్రభుత్వం కూడా ముందుకు వెళ్తోంది. రైవాడ జలాశయం ఆయకట్టుకు సాగునీరు లేకపోయినా, విశాఖ నగర ప్రజలకు తాగునీరు ఇవ్వకపోయినా అదాని ప్రాజెక్టుకు ఆంటకాల్లేకుండా అనుమతులు మంజూరుకు అధికారులను ప్రభుత్వం పరుగులుపెట్టిస్తోంది.

అడ్డుకుంటాం

గిరిజనులకు, రైవాడ ఆయకట్టు రైతులకు నష్టం చేసే మారిక వద్ద నిర్మించబోయే అదానీ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని అడ్డుకుంటాం. జలాశయ పరీవాహక ప్రాంతంలో పవర్ ప్లాంట్‌కు అనుమతులివ్వడమంటే రైతుల గొంతు కోయడమే. మారిక గిరిజనులు జీవనోపాధి కోల్పోతారు. చింతలపూడి పంచాయతీలోని సగం గ్రామాలను ఖాళీ చేయాల్సి వస్తుంది. వందల ఎకరాలు నష్టపోతారు. అడ్డగోలుగా అదాని సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులకు అనుమతులిస్తున్నాయి. ప్రజా ఉద్యమాలతో ప్రాజెక్టును ప్రతిఘటిస్తాం.

-డి.వెంకన్న,
సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

మూడేళ్ల చిన్నారి అదృశ్యం

- నాయనమ్మే తీసుకెళ్లినట్లు సిసి కెమెరాల్లో రికార్డు

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

మూడేళ్ల చిన్నారి అదృశ్యమైన సంఘటన ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత శింగరాయకొండ పంచాయతీలోని బాలరెడ్డినగర్‌కు చెందిన చిలకూరి హరికృష్ణ, శిరీష దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె ఐశ్వర్య (3)ను నాయనమ్మ రాజేశ్వరి వద్ద ఉంచి భార్యాభర్తలు బుధవారం ఉదయం కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన దంపతులకు ఐశ్వర్య కనిపించ నిలదీశారు. ఆమె పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు మొదలుపెట్టారు. సిసి కెమెరాలను పరిశీలించగా నాయనమ్మే బాలికను బస్టాండ్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ సెంటర్‌కు తీసుకెళ్లినట్లు గుర్తించారు. మొదట ఐశ్వర్య నాయనమ్మ వద్ద ఉండగా.. ఆ తర్వాత పాపను గుర్తు తెలియని వ్యక్తి తీసుకుంటున్నట్లుగా కనిపించ డంతో బాలిక నాయనమ్మను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. గుర్తించారు. అయితే, బాలికను గుర్తు తెలియని వ్యక్తికి అమ్మేసినట్లు ప్రచారం సాగుతోంది.

ఐశ్వర్య

6న పిఎస్ఆర్ ఆంజనేయులు పిటిషన్ విచారణ

ప్రజాశక్తి-అమరావతి

ఇబ్రహీంపట్నం పోలీసులకు సినీనటి కాదంబరి జత్వానీ చేసిన ఫిర్యాదు ఆధారంగా సిఐడి నమోదు చేసిన కేసులో సీనియర్ ఐపిఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు హైకోర్టును ఆశ్రయించారు. రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ నూనెపల్లి హరినాథ్ గురువారం విచారణ జరిపారు. ఆంజనేయులు తరపున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. జత్వానీ ఇచ్చింది తప్పుడు ఫిర్యాదని తెలిపారు. వ్యాపారవేత్త విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు జత్వానీపై కేసు పెట్టి అరెస్ట్ చేశారన్నారు. అయితే దీనికి ప్రతీకారంగా ఆమె పలువురు ఐపీఎస్ అధికారులపై ఫిర్యాదు చేశారని, నిందితురాలి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయడం చెల్లదన్నారు. రాజకీయ కారణాలతో తప్పుడు కేసు నమోదు చేశారని చెప్పారు. సిఐడి తరపున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ వివరాలు సమర్పించేందుకు గడువు కావాలని కోరారు. దీంతో విచారణను న్యాయమూర్తి ఈ నెల 6కి వాయిదా వేశారు.

తాగునీటి సవాళ్లకు సంసిద్ధంగా ఉండాలి

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాగునీటి సరఫరా సవాళ్లను ఎదుర్కొనేందుకు అధికారులు పూర్తి స్థాయి సంసిద్ధతతో ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాటు చేయాలని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడిపై మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులతో సమీక్షను గురువారం నిర్వహించారు. తాగునీటి సరఫరాపై రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక వాటర్ వార్ రూమ్‌లు ఏర్పాటు చేసి రోజువారీ నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు. ప్రతి గ్రామంలో ఫిల్టర్ బెడ్లను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేసి శుద్ధమైన నీటిని ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆర్వో ప్లాంట్ల పని తీరును క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. పారదర్శకతతో కూడిన ప్రణాళికలు అమలు చేయాలని చెప్పారు. తాగునీటి సమస్య ఎదుర్కొనే ప్రక్రియలో విద్యార్థుల సహకారం తీసుకుందా మన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటిని ఇంటింటికీ సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ గ్రామానికి ప్రత్యేకమైన సమగ్ర తాగునీటి ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

డిఎస్సి జిల్లాకు ఒక పేపర్‌లో నిర్వహించాలి

- మంత్రి లోకేష్‌కు డివైఎఫ్ఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్సి పరీక్షను ఒక జిల్లాకు ఒక పేపర్ విధానంలో నిర్వహించాలని డివైఎఫ్ఐ రాష్ట్రకమిటీ కోరింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్న గురువారం లేఖ రాశారు.

ఎటువంటి అవినీతికి తావు లేకుండా, అందరికీ సమన్యాయం జరగాలంటే జిల్లాకు ఒక పేపర్ విధానం తీసుకురావాలని కోరారు. నార్మలైజేషన్ వల్ల డిఎస్సి అభ్యర్థులు భయాందోళనకు, గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. తక్షణమే స్పందించి ఒకే పేపర్ ఉండేలా చూడాలని కోరారు. అభ్యర్థులకు వయోపరిమితి 47ఏళ్లకు పెంచాలని, ప్రిపరేషన్ కోసం కనీసం 90 రోజుల సమయం ఇవ్వాలని కోరారు. దరఖాస్తు చేసుకునే సమయంలో వస్తున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు.

సిహెచ్ఒ (ఎంఎల్‌హెచ్‌పి)ల సమస్యలు పరిష్కరించాలి

- ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔసోర్సింగ్ ఎంప్లాయీస్ జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేషనల్ హెల్త్ మిషన్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న సిహెచ్ఒ (ఎంఎల్‌హెచ్‌పి) సమ్మెకు ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్, వర్కర్స్ జెఎసి సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు జెఎసి ఛైర్మన్ ఎ.వి నాగేశ్వరరావు, కో ఛైర్మన్ బి.కాంతరావు, కోశాధికారి డి.దయామణిలు గురువారం ప్రకటన విడుదల చేశారు. వెంటనే సంబంధిత సంఘాల ప్రతినిధులతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు పంపిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎంలోని క్యాడర్లకు ఎంటిఎస్ అమలు చేయకుండా వివక్ష చూపుతుందన్నారు. 2022 వరకూ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులతో సమానంగా ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్లకు ఎంటిఎస్ అమలు చేసేదన్నారు. 15 ఏళ్లుగా అమలైన ఈ విధానానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచిందని తెలిపారు. దీని వల్ల ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నియమాల ప్రకారం హ్యూమన్ రిసోర్స్ (హెచ్‌ఆర్) పాలసీ అమలు చేయాల్సి ఉండగా, దానిని కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. హెచ్‌ఆర్ పాలసీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎల్‌హెచ్‌పిలు వేతన పెంపు, హెచ్‌ఆర్ పాలసీ, ఇన్సెంటీవ్ బకాయిల చెల్లింపు తదితర డిమాండ్ల పరిష్కారం కొరకు సమ్మె నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పిలు ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో వారి విధులు నిర్వహించకుండా వివిధ అదనపు పని భారాలను మోపుతున్నారని చెప్పారు. సెంటర్లలో కాకుండా ఆయా ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో వారికి మధ్యాహ్నం వరకూ వివిధ రకాలు పనులను అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాల వల్లనే సమ్మె అనివార్యమైందన్నారు.

మతంలోకి మారితే ఎస్‌సి హోదా రద్దు

ప్రజాశక్తి, అమరావతి

షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) వ్యక్తులు క్రైస్తవ మతంలోకి మారిన రోజునే వారి ఎస్‌సి హోదా రద్దవుతుందని హైకోర్టు తేల్చి చెప్పింది. ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద లభించే హక్కులు ఉండవని చెప్పింది.. క్రైస్తవ మతంలోకి మారిన వారు ఎస్‌సి, ఎస్‌టి చట్టం ద్వారా రక్షణ కావాలని కనీసం పోలీసులకు కూడా ఫిర్యాదు కూడా చేయలేరని చెప్పింది. ఒకవేళ ఆ విధంగా కేసు పెట్టినప్పటికీ అది చెల్లుబాటు కాదని స్పష్టం చేసింది. ఎస్‌సి, ఎస్‌టిలకు రక్షణ కల్పించేందుకు ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేసింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా కొనసాగుతున్న చింతాడ ఆనంద్ అనే ఓ వ్యక్తి ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కొందరిపై ఫిర్యాదు చేయడాన్ని ఆక్షేపించింది. ఆ చట్టాన్ని పాస్టర్ దుర్వినియోగం చేశారని తప్పు పట్టింది.. ఆ పాస్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేసింది. ఆనంద్ క్రైస్తవ మతంలోకి మారి గత పదేళ్లుగా పాస్టర్‌గా కొనసాగుతున్నట్లు సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారని, దీంతో అతను ఎస్‌సి కాదని జస్టిస్ నూనెపల్లి హరినాథ్ బుధవారం తీర్పు వెలువరించారు. అక్కాల రామిరెడ్డి, మరికొందరు కులం పేరుతో దూషించారని, వీరిపై ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కేసు పెట్టాలని గుంటూరు జిల్లా, పిట్లవానిపాళెం మండలం, కొత్తపాళెంకు చెందిన పాస్టర్ చింతాడ ఆనంద్ 2021 జనవరిలో చందోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ రామిరెడ్డి ఇతరులు దాఖలు చేసుకున్న పిటిషన్ విచారించిన న్యాయమూర్తి పై విధంగా కీలక తీర్పు వెలువరించారు. తాను పాస్టర్‌గా చేస్తున్నట్టు ఫిర్యాదుదారుడే స్వయంగా చెప్పారని తెలిపారు.

పాక్ జాతీయ భద్రతా సలహాదారుగా ఐఎస్ఐ చీఫ్

ఇస్లామాబాద్ : భారత్‌తో ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్న వేళ, పాకిస్తాన్ కీలక చర్య తీసుకుంది. పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ చీఫ్ మహ్మద్ ఆసిమ్ మాలిక్‌ను జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఎ)గా నియమించింది. మంగళవారం కేబినెట్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం జనరల్ మాలిక్‌కు ఎన్ఎస్ఎ బాధ్యతలు అప్పగించారు. తక్షణమే ఈ నియామకం అమల్లోకి వస్తుందని ఆ నోటిఫికేషన్ పేర్కొంది. దేశ పదవ ఎన్ఎస్ఎగా ఆయన నియమితులయ్యారు. ప్రస్తుతం ఐఎస్ఐ చీఫ్‌గా వున్న వ్యక్తికి రెండు కీలకమైన పదవులను అప్పగించడం ఇదే తొలిసారి. గతేడాది అక్టోబరులో ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) డైరెక్టర్ జనరల్‌గా జనరల్ మాలిక్ నియమితులయ్యారు.

కరాచీ, లాహోర్ విమానాశ్రయాలపై పాక్ ఆంక్షలు

కరాచీ, లాహోర్ విమానాశ్రయాలపై పాకిస్తాన్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ విమానాశ్రాయల్లో కొన్ని నిర్ధిష్ట ప్రాంతాలను ఈ నెల 1 నుంచి 31 వరకూ ప్రతి రోజు నాలుగు గంటల పాటు మూసివేస్తున్నట్లు ప్రకటించింది. భద్రత అంశాల కారణంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

అట్టారి-వాఘా సరిహద్దు సంపూర్ణంగా మూసివేత

న్యూఢిల్లీ : భారత్-పాకిస్తాన్ మధ్య ఉన్న అట్టారి-వాఘా సరిహద్దు వద్ద క్రాసింగ్ పాయింట్‌ను గురువారం అధికారులు పూర్తిగా మూసివేశారు. ఈ క్రాసింగ్ పాయింట్ నుంచి గురువారం ఇరు దేశాల నుంచి ఒక్కరూ కూడా సరిహద్దులు దాటలేదని అధికారులు తెలిపారు. పహల్గాంలో ఉగ్రదాడి తరువాత భారత్‌లో స్వల్పకాలిక వీసాతో ఉన్న పాకిస్తానీ పౌరులందరూ దేశం విడిచి వెళ్లాలని కేంద్రం ఆదేశించింది. గతవారం రోజుల నుంచి ఈ క్రాసింగ్ పాయింట్ ద్వారా పాకిస్తానీ పౌరులు భారీగా తరలివెళ్లారు. బుధవారం 125 మంది తిరిగివెళ్లగా, గత ఏడు రోజుల్లో మొత్తం 911 మంది తిరిగివెళ్లారు.

రోహిత్, రికెల్టన్ అర్ధసెంచరీలు

- రాజస్తాన్‌పై ముంబయి ఘన విజయం

జైపూర్: వరుస విజయాలతో ప్రత్యర్థి జట్లకు వణికిస్తున్న ముంబయి జట్టు జైపూర్‌లోనూ రాజస్తాన్‌పై అదరగొట్టింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, రికెల్టన్ అర్ధసెంచరీలకి తోడు.. కెప్టెన్ హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 217పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రాజస్తాన్ జట్టు 16.1ఓవర్లలో 117పరుగులకే కుప్పకూలింది. బౌల్ట్, కరణ్ శర్మకు మూడేసి, బుమ్రాకు రెండు, దీపక్ చాహర్, హార్దిక్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయిని ఓపెనర్లు ఆదుకున్నారు. రికెల్టన్(61; 38బంతుల్లో 7ఫోర్లు, 3సిక్సర్లు), రోహిత్ శర్మ(53; 36బంతుల్లో 9ఫోర్లు) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 116పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ జోడీని రాజస్తాన్ బౌలర్ తీక్షణ విడదీశాడు. ఆ తర్వాత కెప్టెన్ రియాన్ పరాగ్.. రోహిత్ శర్మను ఔట్ చేయడంతో ముంబయి జట్టు 123పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్(48; 23బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు), హార్దిక్(48; 23బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్) మరో వికెట్ కోల్పోకుండా ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. వీరు 3వ వికెట్‌కు ఏకంగా 94పరుగులు జతచేసి ముంబయి జట్టు 200కు పైగా పరుగులు చేసేందుకు దోహదపడ్డారు. దీంతో ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 2 వికెట్ల నష్టానికి 217పరుగులు చేసింది. రాజస్తాన్ బౌలర్లు తీక్షణ, రియాన్ పరాగ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. భారీ ఛేదనలో భాగంగా రాజస్తాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రెండో బంతికి డకౌట్ కాగా.. జైస్వాల్ 13 పరుగులు చేశాడు. లోయర్ ఆర్డర్‌లో ఆర్చర్(30) మినహా మిగిలిన ఏ ఒక్క బౌలర్ రాణించలేకపోయాడు. ఈ గెలుపుతో ముంబయి జట్టు 14పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. ఈ ఓటమితో రాజస్తాన్ రాయల్స్ ఎనిమిదో ఓటమితో ప్లే-ఆఫ్స్ రేసునుంచి నిష్క్రమించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రికెల్టన్‌కు దక్కింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
ముంబయి	11	7	4	0	14	+1.27
బెంగళూరు	10	7	3	0	14	+0.52
పంజాబ్	10	6	3	1	13	+0.27
గుజరాత్	9	6	3	0	12	+0.74
ఢిల్లీ	10	6	4	0	12	+0.36
లక్నో	10	5	5	0	10	-0.32
కోల్‌కతా	10	4	5	1	9	+0.27
రాజస్తాన్	11	3	8	0	6	-0.78
సన్‌రైజర్స్	9	3	6	0	6	-1.10
చెన్నై	10	2	8	0	4	-1.21

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

స్కోర్‌బోర్డు...

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: రికెల్టన్ (బి)తీక్షణ 61, రోహిత్ శర్మ (సి)జైస్వాల్ (బి)రియాన్ పరాగ్ 53, సూర్యకుమార్ యాదవ్ (నాటౌట్) 48, హార్దిక్ పాండ్యా (నాటౌట్) 48, అదనం 7. (20 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 217పరుగులు. **వికెట్ల పతనం:** 1/116, 2/123 **బౌలింగ్:** జోఫ్రా ఆర్చర్ 4-0-42-0, ఫారూఖీ 4-0-54-0, తీక్షణ 4-0-47-1, కార్తికేయ 2-0-22-0, ఆకాశ్ మధ్వాల్ 4-0-39-0, రియాన్ పరాగ్ 2-0-12-1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (బి)బౌల్ట్ 13, వైభవ్ సూర్యవంశీ (సి)విల్ జాక్స్ (బి)దీపక్ చాహర్ 0, నితీశ్ రాణా (సి)తిలక్ వర్మ (బి)బౌల్ట్ 9, రియాన్ పరాగ్ (సి)రోహిత్ (బి)బుమ్రా 16, ధృవ్ జురెల్ (సి అండ్ బి)కరణ్ శర్మ 11, హెట్‌మైర్ (సి)సూర్యకుమార్ (బి)బుమ్రా 0, శుభమ్ దూబె (సి)బౌల్ట్ (బి)హార్దిక్ పాండ్యా 15, జోఫ్రా ఆర్చర్ (సి)బుమ్రా (బి)బౌల్ట్ 30, తీక్షణ (సి)సూర్యకుమార్ (బి)కరణ్ శర్మ 2, కార్తికేయ (సి)దీపక్ చాహర్ (బి)కరణ్ శర్మ 2, మధ్వాల్ (నాటౌట్) 4, అదనం 15. (16.1ఓవర్లలో ఆలౌట్) 117పరుగులు.

వికెట్ల పతనం: 1/1, 2/18, 3/41, 4/47, 5/47, 6/64, 7/76, 8/87, 9/91, 10/117

బౌలింగ్: దీపక్ చాహర్ 2-0-13-1, ట్రెంట్ బౌల్ట్ 2.1-0-28-3, జస్ప్రీత్ బుమ్రా 4-0-15-2, కార్బిన్ బోట్స్ 3-0-29-0, హార్దిక్ పాండ్యా 1-0-2-1, కరణ్ శర్మ 4-0-23-3.

ఐపిఎల్‌లో నేడు
గుజరాత్ టైటాన్స్ x సన్‌రైజర్స్ హైదరాబాద్
వేదిక: అహ్మదాబాద్; రాత్రి 7.30గం॥లకు

భారత్‌కు మరో నాలుగు స్వర్ణాలు

- ముగిసిన ఆసియా అండర్-15, 17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్

న్యూఢిల్లీ: ఆసియా అండర్-15, 17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ బాక్సర్లు సత్తా చాటారు. గురువారంతో ముగిసిన ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో నాలుగు స్వర్ణ పతకాలు జమ అయ్యాయి. ఈ నాలుగు స్వర్ణ పతకాలు బాలికల విభాగంలోనే దక్కాయి. 46కిలోల విభాగంలో ఖుషీ చంద్ 3-2పాయింట్ల తేడాతో మంగోలియాకు చెందిన అల్టానుంజుల్‌ను చిత్తుచేసి బంగారు పతకం చేజిక్కించుకుంది. 50కిలోల విభాగంలో అహనా శర్మ, 54 కిలోల విభాగంలో జన్నత్ ఉజ్బెకిస్తాన్ బాక్సర్లను 5-0పాయింట్లతో చిత్తుచేశారు. ఇక 80కిలోలకు పైబడిన విభాగంలో అషికా జోర్డాన్‌కు చెందిన జనాను ఓడించి భారత్‌కు 15వ స్వర్ణ పతకాన్ని ఖాయం చేసింది. అలాగే అండర్-17 విభాగంలో 60కిలోల విభాగంలో సిమ్రన్‌జీత్ కౌర్, 63కిలోల విభాగంలో హర్షిక ఫైనల్లో ఓడి రజత పతకాలను దక్కించుకున్నారు. చివరిరోజు భారత్‌కు నాలుగు స్వర్ణ, రెండు రజత పతకాలతో సహా మరో ఐదు కాంస్య పతకాలు దక్కాయి. దీంతో ఈ టోర్నీలో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య 43కు చేరింది. ఈ క్రమంలోనే భారత్ పతకాల పట్టికలో 2వ స్థానంలో నిలిచింది. ఇక కజకిస్తాన్ జట్టు అగ్రస్థానంతో, ఉజ్బెకిస్తాన్ జట్టు మూడో స్థానంలో ముగించాయి.

కేరళలో..

ఢిల్లీలోని సిఐటియు కేంద్ర కార్యాలయంలో..

మదురైలో..

దేశవ్యాప్తంగా ఎర్రజెండా రెపరెపలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా అరుణ పతాకం రెపరెపలాడింది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలను తిప్పికొడతామని ప్రతినబూనింది. వాడవాడలా జరిగిన ర్యాలీలు, సభలు, రక్తదాన శిబిరాలుసహా వివిధ కార్యక్రమాల్లో లక్షల మంది కార్మికులు భాగస్వాములయ్యారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మిక సంక్షేమ విధానాలను అనుసరించాలని డిమాండ్ చేశారు.

సిఐటియు కార్యాలయంలో...

న్యూఢిల్లీలోని సిఐటియు కేంద్ర కార్యాలయం (బిటిఆర్ భవన్)లో సిఐటియు జాతీయ అధ్యక్షురాలు హేమలత ఎర్ర జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పాల్గొన్నారు. పి.రామ్మూర్తి భవన్‌లో సిఐటియు జాతీయ కార్యదర్శి స్వదేశ్ దేవ్ రాయ్ జెండా ఆవిష్కరించారు. జాతీయ ఉపాధ్యక్షులు ఆర్. లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఈ నెల 20న జరిగే సమ్మెకు కార్మిక వర్గం సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

కేరళలో...

కేరళ తిరువనంతపురంలో సిపిఎం రాష్ట్ర కార్యాలయం (ఎకెజి సెంటర్)లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ మాస్టర్ జెండాను ఎగురవేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బిజు కందకైతో సహా పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. కొట్టాయంలో జరిగిన ర్యాలీలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్ పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో..

త్రిపురలో...

త్రిపురలోని అగర్తలాలో సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి జితిన్ చౌదరి జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వివరించారు. దీనిపై పోరాటానికి కార్మికులు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.

పశ్చిమ బెంగాల్‌లో...

పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తాలో సిఐటియు రాష్ట్ర కమిటీ బహిరంగ సభ నిర్వహించింది. సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జెండా ఆవిష్కరణలో లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బసు పాల్గొన్నారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు సూర్యకాంత్ మిశ్రా పాల్గొన్నారు.

తమిళనాడులో...

తమిళనాడులోని మధురైలో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన భారీ ప్రదర్శన నిర్వహించారు. తమిళనాడులో సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు .రామకృష్ణన్ ఎర్ర జెండా ఆవిష్కరించారు. దిండిగల్ జిల్లా పార్టీ కార్యాలయంలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు యు.వాసుకి జెండాను ఆవిష్కరించారు.

రాజస్థాన్‌లో

రాజస్థాన్ హనుమగఢ్ జిల్లాలో సిఐటియు ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించారు.

హర్యానాలో...

హర్యానా రోహతక్‌లో జరిగిన కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నేత సురేంద్ర సింగ్ పాల్గొన్నారు.

ఉత్తర ప్రదేశ్‌లో...

ఉత్తరప్రదేశ్‌లో సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నేత హరిలాల్ యాదవ్ జెండాను ఆవిష్కరించారు. చికాగో అమరులకు నివాళులర్పించారు.

తెలంగాణలో...

హైదరాబాద్‌లో సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు.

రాజస్తాన్‌లో..

కొల్‌కతాలో..

ఎకెజి భవన్‌లో అరుణ పతాకాన్ని ఎగురవేస్తున్న సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి

కార్మిక హక్కులు కాలరాస్తున్న లేబర్ కోడ్స్

- **20న సమ్మెలో భాగస్వాములు కండి**
- **మేడే వేడుకల్లో కార్మికులకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి పిలుపు**

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ సర్కార్ కాలరాస్తోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి విమర్శించారు. మేడే సందర్భంగా గురువారం నాడిక్కడ సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్)లో ఆయన అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికాగో కార్మికులు పోరాడి సాధించిన హక్కులను నేడు పాలక వర్గాలు, పెట్టుబడిదారీ వర్గం లాక్కుంటున్నాయని విమర్శించారు. 1886లో ఎనిమిది గంటల పని విధానం పోరాడి సాధించుకున్న హక్కును లేబర్ కోడ్స్‌తో హననం చేస్తున్నారని విమర్శించారు. లేబర్ కోడ్స్‌తో 8 గంటల పని విధానం స్థానంలో 12 గంటల పని విధానం అమలుకు మోడీ సర్కార్ పూనుకుందని అన్నారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశంలో సిఐటియుతో పాటు అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, స్వతంత్ర సంఘాలు ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మోడీ సర్కార్ కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల నిర్ణయాలు అమలు చేస్తోందని విమర్శించారు.

కార్మికులను సామాజిక భద్రత కల్పించటం లేదని, వారికి పోరాడే హక్కు కూడా లేకుండా చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కుట్రలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మాజీ కార్యదర్శి ప్రకాష్ కరత్, పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, తపన్ సేన్, మరియం దావలే, విజూ కృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు మురళీధరన్, మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు హన్నన్ మొల్లా తదితరులు పాల్గొన్నారు.

సైనిక బలగాల నైతికతను దెబ్బతీస్తారా ?

- **పహల్గాం ఘటనపై దర్యాప్తు పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం**

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్ర దాడిపై సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తితో జ్యుడీషియల్ దర్యాప్తు చేపట్టాలని కోరుతున్న పిటిషన్ విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది. ఇలాంటి ఉగ్రవాద విషయాల్లో దర్యాప్తు చేసేందుకు న్యాయమూర్తులేమీ నిపుణులు కాదని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. "ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్క పౌరుడు చేతులు కలపాల్సిన కీలకమైన సమయం ఆసన్నమైంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కాస్త బాధ్యతతో వ్యవహరించాలి. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేయడం ద్వారా మీరు మన సైనిక బలగాల స్థైర్యాన్ని దెబ్బ తీయకండి." అని వ్యాఖ్యానించింది. ఇలాంటి విషయాల్లో మనందరికీ దేశం పట్ల బాధ్యత వుందన్న అంశాన్ని మర్చిపోరాదని, ఇలాంటి అంశాలను జ్యుడీషియల్ పరిధిలోకి లాగవద్దని పేర్కొంది. ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నందున కొట్టివేసినట్లు బెంచ్ తెలిపింది.

వాణిజ్య సిలిండర్‌పై రూ.14.50 తగ్గింపు

న్యూఢిల్లీ : హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే వాణిజ్య సిలిండర్లపై రూ.14.50 తగ్గించినట్లు చమురు సంస్థలు ప్రకటించాయి. గృహాల్లో వినియోగించే వంట గ్యాస్ ధరలో ఎటువంటి మార్పు లేదు. విమాన ఇంధన ధరలను కూడా తగ్గించాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని ఇంధన రిటైలర్ల ప్రకారం.. ఢిల్లీలో కిలోలీటరుకు 4.4శాతం లేదా రూ.3,954 తగ్గించింది. దీంతో కిలోలీటర్ ధర ప్రస్తుతం రూ.85,486.80కి చేరింది. ఏప్రిల్ 1న విమాన ఇంధన ధరను 6.15 శాతం తగ్గించింది.

ఉత్తర కొరియా, రష్యాల మధ్య .. తొలి రోడ్డు వంతెన నిర్మాణం ప్రారంభం

మాస్కో : ఉత్తర కొరియా, రష్యాల మధ్య మొదటి రోడ్ లింక్ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు ఇరు దేశాలు ప్రకటించాయి. సరిహద్దు నదిపై వంతెనను నిర్మించడం ప్రధాన అభివృద్ధి పరిణామమని, దీనివల్ల ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత విస్తరిస్తాయని రెండు దేశాలు గురువారం పేర్కొన్నాయి. వీడియో లింక్ ద్వారా ఇరు దేశాల ప్రధానులు పాక్ థె సాంగ్, మిఖాయిల్ మిషుస్తిన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని మీడియా వర్గాలు తెలిపాయి. ద్వైపాక్షిక సంబంధాలలో ఈ వంతెన నిర్మాణమనేది ఒక చారిత్రక కట్టడంగా గుర్తుండిపోతుందని పాక్ థేసాంగ్ వ్యాఖ్యానించగా, రష్యా -ఉత్తర కొరియా సంబంధాలకు ఇది ఒక మైలురాయి వంటిదని మిఖాయిల్ వ్యాఖ్యానించారు. గురువారం ఇరు దేశాలు వాటి సరిహద్దు నగరాల్లో ఈ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించాయి.

కిలోమీటరు పొడవు వుండే ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని ఏడాదిన్నరలోగా పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ఇరు దేశాలు తెలిపాయి. ఈ బ్రిడ్జి, ఇరు దేశాల ప్రజల మధ్య దూరాన్ని తగ్గించడంతోపాటు పర్యాటకాన్ని కూడా వ్యాప్తి చేస్తుందని తెలిపాయి. ఇప్పటికే ఇరు దేశాలను కలుపుతూ ఒక రైల్వే బ్రిడ్జి వుండగా, వైమానిక సేవలు కూడా కొనసాగుతున్నాయి. రష్యా, చైనాల మధ్య ఉత్తరకొరియా సరిహద్దుల వెంబడి ప్రవహించే తుమెన్ నదిపై ఆటోమొబైల్స్ కోసం వంతెనను నిర్మించడానికి ఇరు దేశాలు గతేడాది జూన్‌లో అంగీకరించాయి.

ముస్లిములను, కాశ్మీరీలను వేధించొద్దు

- **దోషులను కఠినంగా శిక్షించండి**
- **నేవీ అధికారి భార్య హిమాన్షి నర్వాల్**

కర్నాల్, హర్యానా : "ముస్లిమ్‌లను, కాశ్మీరీలను ప్రజలు లక్ష్యంగా చేసుకుని వెంటాడి, వేధించాలని మేం కోరుకోవడం లేదు. కేవలం శాంతిని, న్యాయాన్ని కోరుకుంటున్నాం. ఆయనతో ఎవరైతే తప్పుగా ప్రవర్తించారో వారికి కఠినంగా శిక్ష పడాలని కోరుకుంటున్నాం." అని ఇటీవల పహల్గాం దాడిలో మరణించిన నేవీ అధికారి భార్య హిమాన్షి నర్వాల్ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన పుట్టి పెరిగిన వూరైన కర్నాల్‌లో ఆయన కుటుంబం రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. ఆ సందర్భంగా నర్వాల్ తల్లి, భార్య ఆయనకు నివాళులు అర్పించారు. పహల్గాం దాడికి వారం రోజుల ముందే నర్వాల్‌తో హిమాన్షికి వివాహమైంది. హనీమూన్ కోసం ఆ దంపతులు పహల్గాం వచ్చారు. అక్కడ ఉగ్రవాదులు ఆయన తలకు గురి పెట్టి మరీ కాల్చి చంపారు. తన కొడుకు ఫొటోకు పదే పదే ముద్దు

పెట్టుకుంటూ నర్వాల్ తల్లి కళ్ళనీళ్ల పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా రక్త దాన శిబిరంలో పాల్గొన్న వారికి నర్వాల్ సోదరి సృష్టి కృతజ్ఞతలు తెలియచేశారు. రక్తం దానం చేయడం కోసం సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. కర్నాల్‌లోని ఎన్‌జిఓ నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ యాక్టివిస్ట్స్ (నిఫా) ఈ శిబిరాన్ని నిర్వహించింది. దేశానికి ఎన్నో ఏళ్ల సేవలందించాల్సిన యువ అధికారిని ఉగ్రవాదం బలితీసుకుందని నిఫా చైర్‌పర్సన్ ప్రీత్‌పాల్ పన్నూ విచారం వ్యక్తం చేశారు. సైనికుడు కదనరంగంలో తన రక్తమోడ్చి ప్రజల ప్రాణాలను కాపాడతాడని, ఈనాడు ఆయన గౌరవార్థం ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తాము రక్త దానం చేస్తున్నామని పేర్కొన్నారు.

దోషులందరినీ వేటాడతాం

- **హోం మంత్రి అమిత్ షా**

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్ర దాడిలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ వేటాడతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఈ హేయమైన చర్యకు వారందరూ జవాబు చెప్పేలా చేస్తామన్నారు. ఏ ఒక్క ఉగ్రవాదిని తమ ప్రభుత్వం విడిచిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క కుట్రదారుడిని పట్టుకుంటామని చెప్పారు. "ఇలాంటి పిరికిపంద దాడి జరిపి తప్పించుకోగలమని ఎవరైనా అనుకుంటే అది తప్పే. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. ఈ దేశంలో ప్రతి అంగుళం నుండి ఉగ్రవాదాన్ని సమూలంగా తుడిచిపెడతాం. 140కోట్ల మంది భారతీయులే కాదు, యావత్ ప్రపంచం ఈనాడు భారత్‌తోనే వుంది. ఉగ్రవాదం అంతమయ్యేవరకు మన పోరాటం కొనసాగుతుంది. ఎవరైతే ఈ నీచమైన దాడులకు దిగారో వారిని శిక్షిస్తామని' అమిత్ షా హెచ్చరించారు.

దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు హన్ రాజీనామా

సియోల్ : దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు హన్ డక్ సూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే నెల జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో ఆయన పోటీ చేస్తారని వార్తలు వస్తున్న నేపథ్యంలో గురువారం ఈ ప్రకటన వెలువడింది. దేశం కోసం 'గొప్ప బాధ్యత' ను స్వీకరించేందుకు తాను పదవి నుండి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు హన్ టెలివిజన్ ప్రసంగంలో పేర్కొన్నారు. శుక్రవారం హన్ అధికారికంగా తన అధ్యక్ష ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని స్థానిక మీడియా తెలిపింది. గత డిసెంబర్‌లో దేశంలో కొద్ది గంటల పాటు మార్షల్ లా విధించిన నేపథ్యంలో మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ తీవ్రంగా అభిశంసనలను ఎదుర్కొన్నారు. దేశంలో నెంబర్ 2 పదవిలో వున్న ప్రధాని హన్ తాత్కాలిక అధ్యక్షులుగా నియమితులయ్యారు. ప్రతిపక్ష లిబరల్ డెమొక్రటిక్ పార్టీ నేత లీ జే-మ్యుంగ్ అధ్యక్ష పదవికి పోటీ చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

ఇంటికో పారిశ్రామిక వేత్త..

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడ తామే కల్పిస్తామన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, దీనివల్ల యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకోవాలన్నారు.. జూన్‌లో రాష్ట్రంలో కొత్త పింఛన్ కోసం ధరఖాస్తు చేసుకున్న 86 వేల మందికి పరిశీలించి అందిస్తామన్నారు. రామాయపట్నంలో రూ.95 వేల కోట్ల వ్యయంతో బిపిసిఎల్ రిఫైనరీ వస్తోందని, . కావలి పక్కన దగదర్తిలో ఎయిర్ పోర్టు త్వరలో ప్రారంభిస్తామని, . శ్రీ సిటీ ఇక్కడే ఉందని, రూ. 5 వేల కోట్ల వ్యయంతో ఎల్‌జీ వస్తోందని చెప్పారు. . సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఎండి ఫరూక్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, టిజి భరత్, కె. శ్రీనివాస్, టిజె జనార్దన్, వాసంశెట్టి సుభాష్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎంఎల్‌సి బల్లి కళ్యాణ్, కలెక్టర్ ఒ ఆనంద్, ఎస్‌పి కృష్ణకాంత్ తోపాటు జిల్లాలోని టిడిపి నేతలు, జిల్లా అధికారులు హాజరయ్యారు.

వెల్లడైన డొల్లతనం!

(మొదటిపేజీ తరువాయి)

పెంచి మరీ నాలుగు రోజుల్లో నిర్మాణం జరిగేలా చేశారు' అని త్రిసభ్య కమిటీ చైర్మన్ ఎస్.సురేష్ కుమార్ వద్ద కాంట్రాక్టరు కుండబద్దలుగొట్టారు. ఇది 'దేవుని కార్యం' అని, ప్రసాదం స్కీంలో రిటైనింగ్ వాల్ కట్టాలన్న నిబంధన ఉన్నా ఆ స్కీంలోంచి దీన్ని తీసేసి తాత్కాలికంగా గోడ కట్టమన్నారని వివరించారు. మధ్యలో కట్టడం ఉపయోగం లేదని పనిని ఆపేసినా డిఇ, ఇఇ పని పూర్తి చేయాలంటూ హుకుం జారీ చేశారని త్రిసభ్య కమిటీకి తెలిపారు.

కమిటీ సభ్యులు ఏయే ప్రశ్నలు వేశారు?

'ఈ పనులకు ఎవరు ఆమోదం తెలిపారు? ఎప్పుడు ఆమోదం తెలిపారు? ఇసుక, సిమెంట్, ఇటుకలు వంటి మెటీరియల్‌ను ఏ ల్యాబ్‌లో పరీక్షించారు' అంటూ త్రిసభ్య కమిటీ సభ్యులు కాంట్రాక్టరును ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. ఈ పనులు జరుగుతున్నప్పుడు దేవాదాయ శాఖ (సింహాచలం దేవస్థానం) తరపున ఇంజనీర్లు ఉన్నారా? అంటూ అడగ్గా ఇద్దరు ఇంజనీర్లు మూడు రోజులపాటు మాత్రమే ఉన్నారని కాంట్రాక్టరు బదులిచ్చారు. అన్ని అంశాలనూ త్రిసభ్య కమిటీ సభ్యులు తమ నోట్సుల్లో రాసుకున్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిరప్రసాద్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఈ కమిటీతోపాటే కొండపై ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ రామచంద్రమోహన్, సింహాచలం ఆలయ ఇఒ సుబ్బారావు ఈ కమిటీకి స్వాగతం పలికారు.

ఎండోమెంట్ కమిషనర్‌పై ఆరోపణలు

సింహాచలం చందనోత్సవం వేళ సుమారు లక్షన్నరకుపైగా యాత్రికుల తాకిడి ఉంటుందన్న అంచనా రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ రామచంద్రమోహన్‌కు, ఆలయ ఇఒ సుబ్బారావుకు ఉన్నా దేవాలయానికి అధికార పార్టీ నేతలు, మంత్రులు వచ్చిపోతున్నందున వారి ప్రోటోకాల్‌ను చూడడం, వారి పర్యవేక్షణలకే పరిమితమై గోడ నిర్మాణ పనులపై అశ్రద్ధ వహించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణం లేదా గోడ నిర్మాణ సామగ్రిని సొంతంగానైనా లేదంటే అద్దెకు ల్యాబ్‌లోఐనా టెస్టింగ్ చేయించాలన్న నిబంధన ఉన్నా ఆలయ అధికారులు పక్కన పట్టించుకోకపోవడం, సరైన పిల్లర్లు లేకుండా కేవలం గోడను నాసిరకంగా 12 అడుగుల ఎత్తులో నిర్మించడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. అనూహ్యంగా బుధవారం వేకువజామున వచ్చిన గాలి, వానతో నీటి ఒత్తిడి పెరిగి గోడ దిగువ భాగం నుంచి పెళ్లలు పెళ్లలుగా ఇటుకలు మీద పడడంతో ఏడుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఆదేశానుసారం త్రిసభ్య కమిటీ 72 గంటల్లో నివేదిక ఇవ్వాల్సి ఉంది.

ఉక్రెయిన్‌తో కుదిరిన ఖనిజ ఒప్పందం

- **పంతం నెగ్గించుకున్న ట్రంప్**

వాషింగ్టన్ : ఉక్రెయిన్‌పై అనేక వారాల నుంచి అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి చేస్తున్న ఖనిజాల వెలికితీత ఒప్పందంపై ఇరు దేశాలు సంతకం చేశాయి. ఈ విషయాన్ని ఇరు దేశాలు బుధవారం అధికారికంగా ప్రకటించాయి. ఈ ఒప్పందంతో ఉక్రెయిన్‌లో విలువైన ఖనిజాలు, లోహాలను అమెరికా వెలికితీసుకుంటుంది. అమెరికా, పశ్చిమ దేశాల మద్దతుతో ఉక్రెయిన్ రష్యాతో యుద్ధానికి దిగిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఉక్రెయిన్‌కు అమెరికా కొంత మేరకు సహాయం చేస్తుంది. ఈ ఒప్పందాన్ని ఇప్పటి వరకూ యునైటెడ్ స్టేట్స్ - ఉక్రెయిన్ రీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ అని ఇరు దేశాలు పిలిచాయి. తాజాగా దీనికి ఆర్థిక ఒప్పందంగా ప్రకటించాయి.

ఈ ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఉక్రెయిన్ ఆర్థిక మంత్రి యులియా స్విరిడెంకో వాషింగ్టన్‌కు చేరుకున్నారు. బుధవారం రాత్రి వరకూ ఈ ఒప్పందంపై చర్చలు జరిగాయి. తరువాత ఈ ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధికారులు ప్రకటించారు. ఉక్రెయిన్-రష్యా మధ్య దాదాపు మూడేళ్లగా యుద్ధం జరుగుతోంది. నడుస్తోంది. ఉక్రెయిన్‌పై పెట్టిన పెట్టుబడి తిరిగిరావాలని ట్రంప్ కోరుకుంటున్నారు. ఈ ఒప్పందంతో అమెరికా ఉక్రెయిన్‌కు చేసిన సాయం కంటే తిరిగి ఎక్కువ పొందుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.

రూహ్ అఫజాపై రామ్‌దేవ్ వీడియో కోర్టు ధిక్కరణే

- **ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం**

న్యూఢిల్లీ : రూహ్ అఫజాపై రామ్‌దేవ్ కొత్త వీడియో విడుదల చేయడంపై ఢిల్లీ హైకోర్టు గురువారం తీవ్రంగా స్పందించింది. అవమానకరమైన వ్యాఖ్యలతో రూహ్ అఫజాపై రామ్‌దేవ్ మరో వీడియోను రూపొందించడం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించడమేనని ఆగ్రహం వ్యక్తం చేసింది. రామ్‌దేవ్ ప్రవర్తన ఆయన ఎవరి నియంత్రణలోనూ లేరని, తన సొంత ప్రపంచంలో నివసిస్తున్నారని ధ్రువీకరిస్తుందని జస్టిస్ అమిత్ బన్సాల్ పేర్కొన్నారు. ఆయన ఆలోచనలను తనలోనే ఉంచాలని, వాటిని వ్యక్తపరచవలసిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. హమ్‌దార్డ్ సంస్థకి చెందిన రూహ్ అఫజాపై రామ్‌దేవ్ బహిరంగ వ్యాఖ్యలు, ప్రకటనలు లేదా వీడియోలను పోస్ట్ చేయకూడదంటూ ఏప్రిల్ 22న కోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ తాజాగా మరో వీడియో విడుదల చేయడం ప్రాథమికంగా కోర్టు ధిక్కారణ కిందకే వస్తుందని బన్సాల్ తెలిపారు. విచారణకు హాజరుకావాల్సిందిగా రామ్‌దేవ్‌కు నోటీసులు జారీ చేశారు. పతంజలికి చెందిన గులాబ్ షర్బత్‌ను ప్రచారం చేస్తూ.. రూహ్ అఫజాపై వచ్చే ఆదాయాన్ని మదర్సాలు, మసీదుల నిర్మాణానికి నిధులు సమకూర్చేందుకు వినియోగిస్తున్నారని రామ్‌దేవ్ చేసిన వివాదాస్పద వీడియోపై హమ్‌దార్డ్ సంస్థ కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

కదం తొక్కిన కార్మిక లోకం

(మొదటిపేజీ తరువాయి)

విరమణ, ఉక్రెయిన్‌పై రష్యా దాడి వంటి అంశాలపై అక్కడి ప్రదర్శనకారులు నినాదాలు చేశారు.

ఇండోనేషియా ర్యాలీల్లో రెండు లక్షల మంది కార్మికులు

తైపేలో పలు రంగాల కార్మికులు అధ్యక్ష కార్యాలయం నుంచి కవాతు నిర్వహించారు. ట్రంప్ విధించే సుంకాలతో తమ ఉద్యోగాలు పోతాయని ఆందోళన వ్యకం చేశారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో వేలాది మంది కార్మికులు అధ్యక్ష భవనం దగ్గర ర్యాలీ చేశారు. అక్కడి పోలీసులు బారికేడ్లతో నిరసనకారులను అడ్డుకున్నారు. ఇండోనేషియాలోని జకార్తాలో ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో నేషనల్ మాన్యుమెంట్ పార్క్ వద్ద ప్రజలు, కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. తన ప్రభుత్వం ఇండోనేషియా నుంచి పేదరికాన్ని నిర్మూలించటానికి వీలైనంతగా కష్టపడి పని చేస్తుందని చెప్పారు. మేడే రోజు ర్యాలీలలో దాదాపు రెండు లక్షల మంది కార్మికులు పాల్గొన్నారని ఇండోనేషియా కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు సయీద్ ఇక్బాల్ తెలిపారు. వేతన పెంపుదల కోసం, అవుట్ సోర్సింగ్‌కు ముగింపు పలకాలని, వలస కార్మికులకు బలమైన రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

క్యూబాలో మహా ప్రదర్శన

అమెరికా సాగిస్తున్న ఆర్థిక దిగ్బంధనాన్ని నిరసిస్తూ క్యూబా రాజధాని హవానాలో శ్రామికలోకం కదంతొక్కింది. మేడే సందర్భంగా హవానాలోని జోస్ మార్టిన్ రివల్యూషన్ స్క్వేర్‌కు లక్షలాదిమంది క్యూబన్లు చేరుకుని మహా సముద్రాన్ని తలపించేలా నిర్వహించిన ర్యాలీలో భాగస్వాములయ్యారు. దేశవ్యాప్తంగా కార్మికులు, విద్యార్థులు, కుటుంబాలు మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్యూబా మాజీ అధ్యక్షుడు, విప్లవ నేతల్లో ఒకరైన 93 ఏళ్ల రావుల్ కాస్ట్రో, క్యూబా అధ్యక్షుడు, కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి మిగుయెల్ డయాజ్ కానెల్ తదితరులు హాజరయ్యారు. క్యూబా వర్కర్స్ ఫెడరేషన్ (సిటిసి) కార్యదర్శి ఉలిసెస్ గిలార్టే డె నసిమీంటో మాట్లాడుతూ క్యూబాపై అమెరికా ఆర్థిక ఆంక్షలకు చరమగీతం పాడే వరకూ పోరాటం కొనసాగుతుందని అన్నారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇబ్బందిపడుతున్న కార్మికులు, ప్రజానీకం అందరికీ సంఘీభావం తెలిపారు.

టర్కీలో పదివేల మందితో ర్యాలీ

కార్మిక హక్కులతో పాటు ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టాలన్న విస్తృత పిలుపులకు టర్కీలో మేడే సందర్భంగా జరిగిన భారీ ర్యాలీ వేదికైంది. ఇస్తాంబుల్‌లోని కడికోయ్‌లో పదివేల మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. తక్సిమ్ స్క్వేర్ సమీపంలో మధ్యాహ్నం 400 మందికి పైగా నిరసనకారులను అరెస్ట్ చేశారని లా అసోసియేషన్ తెలిపింది.

అమెరికా వ్యాప్తంగా ఆందోళనలు

అమెరికాలోని చికాగో, న్యూయార్క్, ఫిలడెల్ఫియా, లాస్‌ఏంజెల్స్ వ్యాప్తంగా పలు చోట్ల పెద్ద ఎత్తున మే డే ర్యాలీలు జరిగాయి. తమ హక్కులు, డిమాండ్ల కోసం కార్మికులు నినదించారు. ట్రంప్ పాలనా తీరును తప్పుబడుతూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ నిర్ణయాలు, చర్యలు ఆర్థిక అస్థిరతకు దారి తీస్తున్నాయని 20 లక్షల మంది కార్మికులకు ప్రాతినిథ్యం వహిస్తున్న సర్వీస్ ఎంప్లాయీస్ ఇంటర్నేషనల్ యూనియన్ అధ్యక్షుడు వెరెట్ విమర్శించారు. ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక లోకం నిరసనలు తెలియజేసిందని ఆయన పేర్కొన్నారు.

వివిధ దేశాల్లో....

నేపాల్‌లోని ఖాట్మండ్‌లో మేడే ర్యాలీలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్ట్ సెంటర్) అనుబంధ కార్మిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఇరాక్, పాకిస్తాన్‌లలోని పలు నగరాల్లో కూడా ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు జరిగాయి. పనిదినాలు పొడిగించటం, వలస వ్యతిరేక భావనలు పెరగటం కార్మిక రక్షణలను నాశనం చేస్తున్నాయంటూ జర్మనీలో యూనియన్ నాయకులు హెచ్చరించారు. స్విట్జర్లాండ్‌లో వేలాది మంది ఫాసిజాన్ని, యుద్ధాన్ని ఖండిస్తూ బ్యానర్లతో కవాతు నిర్వహించారు.



భారత ప్రభుత్వం

భారతదేశ ఆర్థిక వృద్ధికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టడం

అమరావతి రాజధాని నగర అభివృద్ధి కొరకు ₹ 58,000 కోట్ల విలువైన రోడ్లు, రక్షణ, రైల్వే మరియు వివిధ పారిశ్రామిక మౌలిక సదుపాయముల ప్రాజెక్టుల శంఖుస్థాపన మరియు జాతికి అంకితం

శ్రీ నరేంద్ర మోదీ

ప్రధాన మంత్రి

శుక్రవారం, మే 2 న 2025 మ॥ 3.00 గం.లకు | అమరావతి, ఆంధ్రప్రదేశ్

శంఖుస్థాపన

అమరావతి రాజధాని నగర అభివృద్ధికై వివిధ ప్రాజెక్టులు
74 Nos

"నవదుర్గ" ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నాగాయలంక వద్ద క్షిపణి ప్రయోగ పరీక్ష శ్రేణి

గోరంట్ల నుండి హిందూపుర్ సెక్షన్ వరకు పేవ్డ్ షోల్డర్లతో నాలుగు వరసల
రహదారి విస్తరణ NH-716G, పొడవు : 34 కి.మీ.

ముద్దనూరు నుండి బి.కొత్తపల్లి సెక్షన్ వరకు పేవ్డ్ షోల్డర్లతో నాలుగు వరసల
రహదారి విస్తరణ NH-716G, పొడవు : 57 కి.మీ.

నంద్యాల నుండి కర్నూలు/కడప సరిహద్దు సెక్షన్ వరకు పేవ్డ్ షోల్డర్లతో రెండు వరసల
రహదారి విస్తరణ NH-167K, పొడవు : 62 కి.మీ.

ముదిరెడ్డిపల్లె నుండి కడప / నెల్లూరు సరిహద్దు విభాగం వరకు పేవ్డ్ షోల్డర్లతో
రెండు వరసల రహదారి విస్తరణ NH-167B, పొడవు : 36 కి.మీ.

రణస్థలం పట్టణ పరిధిలో 6 వరసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
NH-16, పొడవు : 5 కి.మీ.

యర్రమంచి మరియు గుడిపల్లి గ్రామాలలో హాఫ్ క్లోవర్ లీఫ్
మరియు రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణం NH-44, పొడవు : 2 కి.మీ.

గుంతకల్లు వెస్ట్ మరియు మల్లప్ప గేట్ స్టేషన్ల మధ్య రైల్ ఓవర్ రైల్ నిర్మాణం
పొడవు : 10 కి.మీ.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం మధురవాడలో పీఎం ఏక్తా మాల్

జాతికి అంకితం

CS పురం నుండి మాలకొండ సెక్షన్ వరకు పేవ్డ్ షోల్డర్లతో
రెండు వరసల రహదారి విస్తరణ NH-167B, పొడవు : 44 కి.మీ.

మాలకొండ నుండి సింగరాయకొండ సెక్షన్ వరకు పేవ్డ్ షోల్డర్లతో
రెండు వరసల రహదారి విస్తరణ NH-167B, పొడవు : 46 కి.మీ.

సీతారామపురం నుండి దుత్తలూరు సెక్షన్ వరకు పేవ్డ్ షోల్డర్లతో
రెండు వరసల రహదారి విస్తరణ NH-167BG, పొడవు : 36 కి.మీ.

నంద్యాల-యర్రగుంట్ల సెక్షన్ నాలుగు వరసల ఆర్ ఒ బి మరియు సబ్-వే నిర్మాణం
NH-67, పొడవు : 1 కి.మీ.

పుంగనూరు పట్టణ పరిధిలోని రహదారి బలోపేతం
NH-42, పొడవు : 10 కి.మీ.

రేణిగుంట - పొయ్య - నాయుడుపేట విభాగం పేవ్డ్ షోల్డర్లతో
ఆరు వరసల రహదారి విస్తరణ NH-71, పొడవు : 57 కి.మీ.

పోర్ట్ కనెక్టివిటీ ప్రస్తుత ఈస్ట్ బ్రేక్ వాటర్స్ నుండి కాన్వెంట్ జంక్షన్
సెక్షన్ వరకు పేవ్డ్ షోల్డర్లతో నాలుగు / రెండు వరసల రహదారి విస్తరణ NH-516C, పొడవు : 4 కి.మీ.

న్యూ వెస్ట్ బ్లాక్ హట్ క్యాబిన్ మరియు విజయవాడ స్టేషన్ల
మధ్య 3వ రైలు మార్గం
పొడవు : 5 కి.మీ.

బుగ్గనపల్లె సిమెంట్ నగరం మరియు పాణ్యం స్టేషన్ల మధ్య రైల్వే లైన్ డబ్లింగ్
పొడవు : 19 కి.మీ.

ప్రయోజనాలు

- ✦ అమరావతి రాజధాని నగరం అంతటా అధునాతన వరద నిర్వహణ వ్యవస్థలు, సెంట్రల్ మీడియన్లు, సైకిల్ ట్రాక్‌లు మరియు ఏకీకృత సదుపాయాలతో కూడిన మెరుగైన రోడ్లు
- ✦ క్షిపణి పరీక్ష పరిధి కేంద్రం వలన క్షిపణి పరీక్షలు & రక్షణ ప్రాజెక్టులను వేగవంతం చేస్తుంది.
- ✦ NACIN, BEL మరియు సిమెంట్ పరిశ్రమల వంటి ప్రభుత్వ సంస్థలకు మెరుగైన అనుసంధానం.
- ✦ ఉదయగిరి కోట, తిరుపతి, శ్రీకాళహస్తి మరియు కాణిపాకం మొదలైన పురాతన ప్రదేశాలు మరియు ధార్మిక ప్రదేశాలకు నిరంతర అనుసంధానం.
- ✦ వివిధ పట్టణాలలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, మెరుగైన రహదారి భద్రత, వేగవంతమైన ఆర్థిక అభివృద్ధి మరియు మెరుగైన ఉపాధి.
- ✦ ప్రయాణీకుల మరియు సరుకు రవాణా రెండింటికీ పెరిగిన అవసరములను తీర్చుటకు
- ✦ గుంతకల్ జంక్షన్‌లో రద్దీని తగ్గించడం ద్వారా సరళముగా మరియు ప్రభావవంతంగా రైలు కదలికలు.
- ✦ మేక్ ఇన్ ఇండియా చొరవకు మద్దతు ఇస్తూ, ఒడిఒపిని ప్రోత్సహిస్తుంది మరియు ప్రధాన మంత్రి ఏక్తా మాల్ ద్వారా దేశీయ ఉత్పత్తుల మార్కెట్ ఉనికి పెరుగుదల

CBC 37107/15/0002/2526

వీరి ఘనమైన సమక్షంలో

శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ — గవర్నర్, ఆంధ్రప్రదేశ్ | శ్రీ నారా చంద్రబాబు నాయుడు — ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ | శ్రీ రాజ్ నాథ్ సింగ్ — కేంద్ర రక్షణ మంత్రి | శ్రీ నితిన్ జయరామ్ గడ్కరీ — కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి | శ్రీ పియూష్ గోయల్ — కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ మంత్రి

శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు — కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి | శ్రీ అశ్విని వైష్ణవ్ — కేంద్ర రైల్వే, సమాచార & ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి | డా. చంద్ర శేఖర్ పెమ్మసాని — కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు సమాచార శాఖ సహాయ మంత్రి | శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ — కేంద్ర భారీ పరిశ్రమలు మరియు ఉక్కు శాఖ సహాయ మంత్రి | శ్రీ కె. పవన్ కళ్యాణ్ — ఉప ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్

పార్లమెంటు సభ్యులు

శ్రీ వల్లభనేని బాలశౌరి | శ్రీ బి. కె. పార్థసారథి | శ్రీ వై. ఎస్. అవినాష్ రెడ్డి | డా. బైరెడ్డి శబరి | శ్రీ కలిశెట్టి అప్పలనాయుడు | శ్రీ జి. లక్ష్మీనారాయణ
శ్రీ మతుకుమిల్లి శ్రీభరత్ | శ్రీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి | శ్రీ ప్రభాకర్ రెడ్డి వేమిరెడ్డి | శ్రీ పి. వి. మిధున్ రెడ్డి | శ్రీ మద్దిల గురుమూర్తి | శ్రీ కేశినేని శివనాథ్

DD NEWS Watch the Event live on DD News

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68